RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 326 శనివారం 20 డిసెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## రద్దీ ప్రాంతాల్లో మాస్కు ధరించండి..

చెన్నై: రద్దీ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు మాస్క్ ధరించాలని ఆరోగ్యశాఖ సూచించింది. వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగలు ఎండ తీవ్రత, రాత్రి వేళల్లో వర్షం కురుస్తోంది. ఈ కారణంగా చెన్నై సహా పలు జిల్లాల్లో వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉంది. నగరంలో కూడా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లునొప్పులు తదితర లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య అధికమవుతోంది. ఈ క్రమంలో, ఆరోగ్య శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయని, జ్వరాలు నిరోధించేలా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించింది. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు రద్దీ ప్రాంతాలకు వెళ్లొద్దని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించాలని పేర్కొంది.




## నియామకాల్లో పారదర్శకత ముఖ్యం

### పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల జాతీయ సదస్సును ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

హైదరాబాద్, డిసెంబర్ 19: నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై ద ృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నియామకాల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషన్ చైర్మన్లకు స్పష్టం చేశారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చని కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు.. ఈ సదస్సుకు హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, పరస్పర సహకారంపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఈ సదస్సుకు హాజరైన రాష్ట్రపతి ముర్ముకు రామోజీ ఫిలిం సిటీలో ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట తెలంగాణకు చెందిన పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిషు?దేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, యూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్, యూపీఎస్సీ కార్యదర్శి శశి రంజన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సు శనివారం (20-12-2025)తో ముగియనుంది. ఈ సదస్సుకు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరుకానున్నారు.



## ప్రజావాణిలో 74శాతం

## ఫిర్యాదులు పరిష్కరించాం

హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లల్లో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. బేగంపేట ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రజావాణి 2వ వార్షికోత్సవానికి భట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి ఇన్‌ఛార్జి దివ్యదేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారుల తమ అనుభవాల పంచుకున్నారు. అంకితభావంతో సేవలు అందించి.. ఫిర్యాదుల పరిష్కారానికి క ృషి చేసిన అధికారులను సన్మానించారు. ఈ సందరరేగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆక్షేపించారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారానికి దూరమైన విపక్షం ఎన్ని విమర్శలు చేసినా.. తాము మరింత ముందుకు వెళ్తామన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజావాణి విజయవంతం చేసిన చిన్నారెడ్డి, దివ్యాదేవరాజన్‌కు భట్టి అభినందనలు తెలిపారు.




## లోక్‌సభ నిరధిక వాయిదా..

### ఆమోదం పొందిన కీలక బిల్లులు ఇవే..

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటితో(శుక్రవారం) ముగిశాయి. లోక్‌సభ నిరవదిక వాయిదా పడింది. డిసెంబర్ 1వ తేదీన సమావేశాలు మొదలయ్యాయి. 19వ తేదీ (ఈరోజు) వరకు కొనసాగాయి. మొత్తం 15 రోజుల పాటు సమావేశాలు జరిగాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వాడీ వేడిగా సాగాయి. సమావేశాల సందర్భంగా లోక్‌సభ పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది.

**లోక్ సభ ఆమోదం తెలిపిన కీలక బిల్లులు..** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. అణు ఇంధన రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించేందుకు ఉద్దేశించిన శాంతి బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి) బిల్లును మూజువాణి ఓటుతో రాజ్యసభ ఆమోదించింది. బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచే బీమా సవరణ బిల్లు (సబ్ కా బీమా సబ్ కా రక్ష)ను ప్రతిపక్షాల నిరసనల మధ్యే లోక్‌సభ ఆమోదించింది. మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్(రెండవ సవరణ)బిల్లు 2025 కి లోక్ సభ ఆమోదం తెలిపింది. సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2025. నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025. సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు 2025. ఉన్నత విద్యా కమిషన్ బిల్లు 2025. జన్ విశ్వాస్(నిబంధనల సవర) బిల్లు, దివాళా, దివాళా కోడ్ (సవరణ) బిల్లు. పారదర్శకంగా భూసేకరణ కోసం జాతీయ రహదారుల(సవరణ) బిల్లు. కంపెనీల చట్టం సవరించడానికి కార్పొరేట్ చట్టాలు(సవరణ) బిల్లులకు లోక్ సభ ఆమోదం తెలిపింది.




## పంచాయతీ ఎన్నికలపై రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయి. తాజాగా ఎన్నికల ఫలితాలు, ట్రెండ్స్ పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు నిర్మల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. గత ఎన్నికలతో పోల్చితో ఈసారి బీజేపీ గణనీయమైన పురోగతి సాధించిందని అన్నారు. గతంలో ప్రాతినిధ్యం లేని జిల్లాల్లో కూడా ఈసారి బీజేపీకి మంచి ఓటింగ్ పడింది. కేంద్రం తీసుకువస్తున్న పథకాలు ప్రజల్లోకి వెళ్తున్నాయి. ఈ క్రమంలోనే రోజు రోజుకీ బీజేపీపై ప్రజలకు విశ్వాసం పెరిగిపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో అభివ ృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం నిధులతో జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులను తమ స్వలాభం కోసం ఖర్చు చేయకుండా చూడాలంటే రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ విజయాల గురించి గొప్పలు చెప్పుకుంటున్నాయి. చాలా చోట్ల అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయని విమర్శించారు. కానీ బీఆర్ఎస్ - కాంగ్రెస్ పార్టీ వేర్వేరు కాదు.. రెండో ఒక్కటే. మహాత్మా గాంధీ అంటే బీజేపీకి ఎంతో గౌరవం, రామరాజ గ్రామస్వరాజ్యం కోసమే ఉపాధి హామీ పథకం పేరు మార్చడం జరిగిందని అన్నారు. ఉపాధి హామీ పథకం ఇంతకు ముందు 100 రోజులు ఉంటే దాన్ని కేంద్ర ప్రభుత్వం 120 రోజులకు పెంచింది.. దీని వల్ల ఎంతో మంది నిరుపేదలకు లాభం చేకూరుతుందని తెలిపారు.

## సీఎం రేవంత్ పిలుపు మేరకే మావోలు లొంగిపోయారు: డీజీపీ శివధర్ రెడ్డి




హైదరాబాద్, డిసెంబర్ 19: తెలంగాణలో భారీగా మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. దాదాపు 41 మంది మావోయిస్టులు ఈరోజు (శుక్రవారం) డీజీపీ శివధర్ రెడ్డి ముందు సరెండర్ అయ్యారు. మావోయిస్టులు లొంగిపోవడంపై డీజీపీ మీడియాతో మాట్లాడుతూ... 24 ఆయుధాలతో 41 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయినట్లు తెలిపారు. ఏకే-47లు 3, ఎల్ఎమ్‌జీ 1, ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు 5, ఇన్సాస్ రైఫిళ్ళు 7, బీజీఎల్ గన్ 1, 303 రైఫిళ్ళు 4, సింగిల్ షాట్ రైఫిల్ 1 , ఎయిర్ గన్స్ 2 మొత్తం 24 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లొంగిపోయిన 41 మందిలో ఇద్దరు తెలంగాణ వారు కాగా.. 39 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు ఉన్నారన్నారు. అలాగే 11 మంది గెరిల్లా ఆర్మీ బెటాలియన్ చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. 24 ఏళ్లుగా అండర్ గ్రౌండ్‌లో ఉన్న తెలంగాణకు చెందిన ఎర్రోల్ల రవి అలియాస్ సంతోష్, ప్రవీణ్ లొంగిపోయారని అన్నారు. అలాగే కనికారుపు ప్రభంజన్ పార్టీ సభ్యుడు, పీడీఎస్ సభ్యుడు, రెండో రీజినల్ కమాండ్ ఆఫ్ తెలంగాణకు చెందిన 5 మంది, కొత్తగూడెం, అల్లూరు సీతరామరాజు డీవీసీ స్టేట్ కమిటీ క్యాడర్‌కు చెందిన నలుగురు సరెండర్ అయినట్లు చెప్పారు. అమరవీరుల దినోత్సవం సందరరేగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మావోయిస్టులు లొంగుపోయారని డీజీపీ వెల్లడించారు. ప్రాణాలు కాపాడుకోడానికి తెలియని ప్రదేశాలకు వెళ్లాలని మావోయిస్టు పార్టీ ఒత్తిడి చేసిందని.. ఇలాంటి పరిస్థితుల్లో వేరే ప్రాంతాలకు వెళ్లడం కష్టంగా భావించి మావోలంతా లొంగిపోయినట్లు తెలిపారు. డివిజనల్ కమిటీ సభ్యులకు రూ. 4 లక్షలు, సభ్యులకు రూ.4 లక్షల రివార్డు అందజేస్తున్నామన్నారు. ఆయుధాలతో లొంగిపోతే వారికి మరింత నగదును రివార్డ్స్ కింద అందజేస్తున్నామని చెప్పారు. కోటి 47 లక్షల రివార్డ్స్ అందిస్తున్నామని.. తక్షణ సహాయం కింద రూ.25 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణాలో ఈ ఏడాది 509 మంది మావోయిస్టులు లొంగిపోయారన్నారు. తెలంగాణకు చెందిన 54 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇందులో 5 మంది సెంట్రల్ కమిటీలో ఉన్నారని , 8 మంది స్టేట్ కమిటీలో ఉన్నారన్నారు. అలాగే 13 మంది డివిజన్ కమిటీ , 12 మంది కిందిస్థాయిలో సభ్యులుగా ఉన్నట్లు చెప్పారు. వీరిలో 48 మంది వేరే రాష్ట్రాల్లో పని చేస్తున్నారని.. ఏడుగురు మాత్రమే తెలంగాణలో ఉన్నట్లు గుర్తించినట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.




## బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తత..

### స్థానిక పత్రికలకు నిప్పు పెట్టిన ఆందోళనకారులు

చట్టోగ్రామ్ పోర్ట్ నగరంలోని ఖుల్షీ ప్రాంతంలో ఉన్న భారత హైకమిషన్ కార్యాలయం ఎదుట నిరసనకారులు గుమిగూడారు. హాది హత్యను ఖండిస్తూ, అవామీ లీగ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నిరసనకారులను కార్యాలయ ప్రాంగణం నుంచి చెదరగొట్టారు. అక్కడే భారీగా మోహరించారు. హైది మరణ వార్త తెలియగానే కోపంతో ఉన్న ప్రజలు నిరసనలు చేపట్టారు. నినాదాలు చేస్తూ, ప్లకార్డులు పట్టుకుని నిరసనకారులు హాది భద్రతలో అధికారుల వైఫల్యమే కారణమని ఆరోపించారు. ఆగ్రహంతో ఉన్న కొంతమంది నిరసనకారులు డైలీ ప్రథమ్ ఆలో కార్యాలయంపై దాడి చేశారు. ఆ తర్వాత ది డైలీ స్టార్ పై దాడి చేసి నిప్పు పెట్టారు. ఈ కార్యాలయంలో పలువురు చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లిన నిరసనకారులు అడ్డుకున్నారు. ఇక భవనంలో చిక్కుకున్న వారిని తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో కార్యాలయం నుంచి సురక్షితంగా బయటకు తీసుకున్నట్లు స్థానిక వార్తపత్రిక పేర్కొంది. ఇంక్విలాబ్ మంచ్ ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ హైది సింగపూర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. గత శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పుల జరిపారు. తీవ్రంగా గాయపడిన హైదిని మెరుగైన చికిత్స కోసం సింగపూర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ మరణవార్త విన్న అనంతరం ఢాకాలో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. హైది ఇటీవల భారతదేశ మ్యాప్‌పై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ క్రమంలో ఆయన మృతితో బంగ్లాదేశ్‌లో గురువారం అర్ధరాత్రి నుంచి భారత వ్యతిరేక ఆందోళనలు మొదలయ్యాయి. మరోవైపు ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధానమంత్రి మహ్మద్ యూనస్ శాంతిని పాటించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ సంతాప దినంగా ప్రకటించి, దేశవ్యాప్తంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని తెలిపారు. హైది మరణానికి కారణమైన వారికి వదిలపెట్టబోమని హెచ్చరించారు.

# సంపాదకీయం

## అమెరికాలో ఉద్యోగ సంక్షోభం తీవ్రం

అమెరికా ఉద్యోగ మార్కెట్ ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభ దశలో ఉంది. 2003 తర్వాత అక్టోబర్ నెలలో తొలిసారిగా ఇంత భారీగా ఉద్యోగాలు కోల్పోయిన నెలగా 2025 అక్టోబర్ నిలిచింది. చాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ సంస్థ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, 2025 అక్టోబర్ లో సుమారు 1.5 లక్షల మంది ఉద్యోగులు తొలగించబడ్డారు. ఇది సెప్టెంబర్‌తో పోలిస్తే దాదాపు మూడు రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు దాదాపు 10 లక్షల మంది అమెరికన్లు తమ ఉద్యోగాలను కోల్పోయారు.

**ప్రధానంగా ప్రభావితమైన రంగాలు...** టెక్నాలజీ, రిటైల్, సర్వీసులు, గిడ్డంగులు, మీడియా వంటి రంగాలు ఈ సంక్షోభంలో ఎక్కువగా దెబ్బతిన్నాయి. టెక్నాలజీ రంగం అత్యంత దెబ్బతిన్నది. అక్టోబర్‌లోనే 33, 000 మందికి పైగా ఉద్యోగులు తొలగించబడ్డారు.

గిడ్డంగుల రంగం: ఈ రంగంలో 48,000 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయాయి. లాభాపేక్షలేని సంస్థలు : ఇవి 27,000 మందికి పైగా ఉద్యోగులను తీసివేశాయి. మీడియా రంగం: ఈ ఏడాదిలోనే సుమారు 16,000 ఉద్యోగాలు కోల్పోయి తీవ్రంగా దెబ్బతింది.

**సంక్షోభానికి కారణాలు....** నిపుణుల విశ్లేషణ ప్రకారం, ఈ పరిస్థితికి అనేక అంశాలు కారణమవుతున్నాయి. కృత్రిమ మేధస్సు వినియోగం: కంపెనీలు ఆటోమేషన్ వైపు మళ్లి, ఖర్చులను తగ్గించుకునేందుకు సిబ్బందిని తగ్గిస్తున్నాయి. వ్యాపార వ్యయాలు అధికమవడం: నిర్వహణ ఖర్చులు పెరగడం. వినియోగదారుల ఖర్చులు తగ్గడం: మార్కెట్‌లో వస్తువుల కొనుగోలు శక్తి తగ్గడం.

**నియామకాలు కనిష్ట స్థాయికి...** ఒకవైపు తొలగింపులు రికార్డు స్థాయిలో ఉండగా, మరోవైపు ఉద్యోగ నియామకాలు గత 14 ఏళ్లలో కనిష్ట స్థాయికి చేరాయి. అంటే ఉద్యోగాలు కోల్పోయిన వారికి కొత్త అవకాశాలు దొరకడం మరింత కష్టంగా మారింది. నివేదిక విడుదల చేసిన సంస్థ ప్రతినిధి ఆండీ చాలెంజర్ మాట్లాడుతూ, "కంపెనీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. కొత్త నియామకాలపై చాలా మెలకువగా ఉన్నారు" అని తెలిపారు.

**నిపుణుల హెచ్చరిక....** ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, 2025లో మొత్తం తొలగింపులు పాండమిక్ కాలం నాటి స్థాయికి చేరే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో సాంకేతిక అభివృద్ధి పెరిగిన కొద్దీ, మానవ వనరులపై ఆధారపడే అవకాశాలు తగ్గుతున్నాయి. వేగంగా పెరుగుతున్న ఆటోమేషన్ కారణంగా, రాబోయే సంవత్సరాల్లో ఉద్యోగ మార్కెట్ పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని, ఉద్యోగ భద్రత అమెరికా కార్మికులకు మరింత సవాలుగా మారుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా మాస శివరాత్రి పూజలు





శామీర్ పేట, డిసెంబర్ 19 (గరుడ వార్త) : భక్తిశ్రద్ధలతో ఘనంగా మాస శివరాత్రి పూజలను నిర్వహించారు. గురువారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. శామీర్ పేట కు చెందిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి భజన మండలి సభ్యులు, ఉప్పర్ పల్లి కి చెందిన భజన మండలి సభ్యులు, తూంకుంట కు చెందిన భజన మండలి సభ్యులు సంయుక్తంగా భక్తి గీతాలు ఆలపించారు. భక్తుల సహకారంతో అన్నదానం చేపట్టగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. అలాగే ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలోని శివాలయాలలో మాసశివరాత్రి పూజలను నిర్వహించారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించగలిగితే అన్నింటారనించగలరు.... శ్రీనివాస్ రెడ్డి





శామీర్ పేట, డిసెంబరు 19 ( గరుడ వార్త ) : విద్యార్థులు క్రీడల్లో రాణించగలిగితే మునుముందు మంచి భవిష్యత్తు ఉంటుందని మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ పరిధిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ క్రిష్ణ ఆధ్వర్యంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్ తో కలిసి శ్రీనివాస్ రెడ్డి బాలిక 3వ స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు క్రమశిక్షణతో విద్య నభ్యసిస్తూ క్రీడలపై దృష్టి సారించాలన్నారు. శ్రద్ధతో శిక్షణ పొందుతు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు పొందాలని సూచించారు. క్రీడా పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని 900 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ స్పోర్ట్స్ ఆఫీసర్ సోమేశ్వర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మైనార్టీ గురుకుల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీలా, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కాంతమ్మ, మూడుచింతలపల్లి మున్సిపల్ కమీషనర్ పవన్ కుమార్, రంగారెడ్డి జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలల పీడీలు, పీఈటీలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్ మృతి చెందడంతో సంతాపం తెలిపిన నాయకులు...

శామీర్ పేట, డిసెంబర్ 19( గరుడ వార్త ) : అనారోగ్యంతో మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్ మృతి మృతి చెందడంతో నాయకులు సంతాపం తెలిపారు. మూడు చింతలపల్లి మున్సిపల్ పొన్నాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ బత్తిని సత్యనారాయణ గౌడ్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సత్యనారాయణ గౌడ్ ఒక పర్యాయం సర్పంచ్ గా మరొక పర్యాయం ఎంపీటీసీ సభ్యుడిగా గ్రామానికి సేవలు అందించారు.

కాగా సత్యనారాయణ గౌడ్ మృతి చెందాడని సమాచారం తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, మాజీ ఎంపీపీ నాలుక యాదగిరి లు ఆయన నివాసానికి విచ్చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంత్యక్రియలో పాల్గొని పాడెను మోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యనారయణ గౌడ్ గతంలో గ్రామ వార్డు సభ్యునిగా, సర్పంచ్ గా, ఎంపీటీసీగా సేవలంది ంచారన్నారు. ఆయన మృతి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరారు. పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు సత్యనారాయణ గౌడ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ప్రమాద వశాత్తు బైక్ అదుపుతప్పడంతో, గోడను ఢీకొని యువకుడు మృతి



శామీర్ పేట, డిసెంబర్ 19( గరుడ వార్త ) : ప్రమాద వశాత్తు బైక్ అదుపుతప్పి గోడను ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. జీనోమ్ వ్యాలీ ఇన్స్పెక్టర్ గురువయ్య తెలిపిన వివరాల ప్రకారం అలియాబాద్ గ్రామానికి చెందిన గడుసుకుంటి సంజీవ(30) శుక్రవారం సాయంత్రంతన పల్సర్ బైక్ పై లాల్ గడి మలక్ పేట మీదుగా తునికి బొల్లారం గ్రామానికి వెళు తున్నాడు.లాల్ గడి మలక్ పేట నర్సరీ దగ్గర బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన గల నర్సరీ గోడకు ఢీకొన్నాడు. దీంతో సంజీవ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇన్స్పెక్టర్ గురువయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు.

## నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లు

కరీంనగర్ : జిల్లా కేంద్రంలో వ్యాపార, వాణిజ్య సంస్థలు అనుమతుల ప్రకారం పార్కింగ్ కోసం వదలాల్సిన స్థలాలు వదలకపోవడంతో వాహనాలన్నీ రోడ్ల మీదనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విధిగా వాహనాలు నిలిపేందుకు స్థలం ఉండాల్సి ఉండగా, అలాంటి విషయాన్ని ఇన్నాళ్లు ఎవరూ పట్టించుకోలేదు. వీటిని ఎక్కడ పడితే అక్కడ రోడ్డుపై నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.పట్టణ ప్రణాళిక నిబంధనల ప్రకారం వాణిజ్య భవనాలకు కచ్చితంగా పార్కింగ్ సౌకర్యం ఉండాలి. అక్కడికి వచ్చే వాహనాలను లోపలకు నిలుపుకోవడానికి సెల్లార్లు ఉండాల్సి ఉండగా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేసుకున్నారు. వాటిని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. కొందరైతే వాటిని వాడకుండా తాళం పెడుతున్నారు.శ్రీ రద్దీ ఎక్కువైన సమయాల్లో రోడ్ల మీద వాహనాలు నిలుపుతున్నారు. రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. నివాసిత భవనాలకు సెట్‌బ్యాక్ మాటే కనిపించడంలేదు. రోడ్డు మీదకు వచ్చి ఫిల్లర్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**రాకపోకలకు నరకయాతన..**నగరంలోని టవర్‌సర్కిల్, మార్కెట్, సిక్కువాడీ, మదీన కాంప్లెక్స్, రాజీవ్‌చౌక్, ఉస్మాన్‌పుర, గాంధీరోడ్డు, డాక్టర్ స్ట్రీట్, ప్రభుత్వాసుపత్రి వెనుకాల, కోర్టు నుంచి మంచిర్యాల చౌరస్తా వైపు, కలెక్టరేట్ రోడ్డు, ముకరంపుర నుంచి మంకమ్మతోట, రాంనగర్ వైపు, రాజీవ్‌చౌక్ నుంచి రూరల్ పోలీస్‌స్టేషన్ మీదుగా కమాన్ వైపు, జ్యోతినగర్ నుంచి విద్యానగర్, నాకా చౌరస్తా నుంచి అశోక్‌నగర్ తదితర ప్రాంతాలు ఉదయం, సాయంత్రం రద్దీగా ఉంటాయి. ఆసుపత్రులు, బ్యాంకులు, హోటళ్లు, టిఫిన సెంటర్లు ఉన్న చోట అయితే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే.

## ఖాళీ స్థలాలు.. వ్యాధులకు కారకాలు

గోదావరిఖని : నగరంలోని వివిధ కాలనీల్లోని ఖాళీ ప్రదేశాలు(ప్లాట్లు) వ్యాధులకు కారకాలుగా మారుతున్నాయి. వర్షాకాలంలో ఆయా ప్రదేశాల్లో వరద, మురుగునీరు నిలవడం, దోమలు, పందులకు ఆవాసంగా మారడం, పరిసరాల్లో నివసించేవారికి దుర్గంధంతో పాటు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో వరద, మురుగునీరు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రంగా ఉంచాలని.. లేకపోతే నగరపాలిక ఆధ్వర్యంలో శుభ్రం చేయించి జరిమానా విధిస్తామని పేర్కొనడంతో కొందరు యజమానులు మాత్రమే స్పందించి ఆయా స్థలాలను శుభ్రం చేయించారు. నగరపాలిక నిబంధనల ప్రకారంగా జరిమానాలు విధించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ వివిధ కారణాలతో ఆచరణకు నోచుకోలేదు.

నగరంలోని కాకతీయనగర్, మార్కండేయకాలనీ, శాంతినగర్, శ్రీనగర్ కాలనీ, ఇందిరానగర్, శివనగర్, రాజ్యలక్ష్మీ తదితర కాలనీల్లో ఖాళీ ప్రదేశాల్లో మురుగు, వరద, చెత్తాచెదారం సమస్య తీవ్రంగా ఉంది. నివాసాల మధ్య ఖాళీ ప్లాట్లలో మురుగునీరు నిలుస్తుండటంతో దానికి ఇరువైపులా ఇళ్లలోని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలున్న కాలనీల్లోనే సమస్య తీవ్రంగా ఉంది. స్థలం ఖాళీగా ఉండటంతో సమీపంలోని వారు చెత్తను అందులోనే



పడేస్తుండటంతో కొన్ని కాలనీల్లో ఖాళీ ప్రదేశాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించి నోటీసులు జారీ చేస్తామని గతంలో నగరపాలక అధికారులు పేర్కొన్నా ఆచరణకు నోచుకోవడం లేదు. స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న స్థలాల్లోనూ మురుగు, చెత్త సమస్య లేకుండా శ్రద్ధ వహిస్తే అధిక శాతం సమస్య పరిష్కారం కానుంది.అధిక రేటు వస్తే విక్రయిద్దామని, వీలున్నప్పుడు ఇల్లు కట్టుకుంటామని ప్లాట్ల యజమానులు నిశ్చింతంగా ఉండగా, వాటి పక్కన ఇళ్లు కట్టుకొని నివసించే వారు రోగాల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నగరపాలక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ధ ప్రాతిపదికన ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన మురుగు, వరద, చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

## కొలువులకు మార్గం

సిరిసిల్ల : జిల్లాలో డిగ్రీలు, ఆపై చదువులు పూర్తిచేసిన యువత చాలా మంది ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. వీరిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలనే ఆకాంక్ష ఉంటే.. మరికొందరు ప్రైవేటు సంస్థల్లోనైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఎందులోనూ పూర్తిస్థాయి ఉద్యోగావకాశాలు లభించకపోవచ్చు. అందుకే జిల్లాలోని ఉపాధికల్పన కార్యాలయానికి అనుబంధంగా మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)ని ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్లో 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

**అవకాశాలను మెరుగుపర్చేందుకు..**

దేశంలోని ప్రైవేటు సంస్థలతోపాటు విదేశాల్లోనూ విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి. జిల్లా ఉపాధికల్పనశాఖ కార్యాలయంలో తొమ్మిది వేల మంది నిరుద్యోగులు తమ వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి నెలకు సగటున 30 మంది నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు కల్పించాలని దరఖాస్తులతో వస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు దిశానిర్దేశం చేయాల్సిన ప్రభుత్వ వ్యవస్థ (ఉపాధి కల్పన కార్యాలయం) స్థితిగతులు, పనితీరు, లక్ష్యాలను మెరుగుపరిచేందుకు మోడల్ కెరీర్ కేంద్రం ప్రారంభించనుంది.

ఎంసీసీలో ఉద్యోగ సమాచారం, నిరుద్యోగులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వటంతోపాటు ప్రతినెలా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తారు. వాటన్నింటికి అవసరమైన సమాచారం ఎంసీసీలో అందుబాటులో ఉంటుంది. ఉద్యోగమేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆయా సంస్థల్లో అనుసరించాల్సిన తీరు. బృంద చర్చలు, ఆన్‌లైన్ ముఖాముఖిలో పాటించాల్సిన మెలకువలను ఈ కేంద్రంలో తర్ఫీదు ఇస్తారు.

విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతకు తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ (టామ్‌కామ్) జిల్లాల వారీగా ఉద్యోగ మేళాలను నిర్వహిస్తోంది. గల్ఫ్ దేశాలతోపాటు జపాన్, యూరప్, మిడిల్‌ఈస్ట్ దేశాలు, ఇంగ్లాండ్, కెనడా, జర్మనీ ఆస్ట్రేలియాతో కలిపి 20 దేశాల్లో ఈ సంస్థ విస్తరించింది. నర్సింగ్, హోటళ్లు, నిర్మాణరంగం, డ్రైవింగ్,



కేర్‌టేకర్లు వంటి 15 రకాల విభాగాల్లో అవకాశాలు కల్పిస్తుంది. ఆయా దేశాల నిబంధనల ప్రకారం భాషలు, అందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తారు. ఆయా మేళాలు నిర్వహణ సమయంలో ఎంసీసీలో ప్రత్యేకంగా నిపుణులకు నియమించి శిక్షణనిస్తారు. విదేశీ ఉద్యోగాలకు వెళ్లాలనుకునే జిల్లా యువతకు ఇది మంచి అవకాశం.

**అందుబాటులోకి తీసుకొస్తాం**

జిల్లాలో త్వరలోనే ఎంసీసీ అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రతినెలా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాం. వాటిలోని ప్రైవేటు కార్పొరేట్ సంస్థల్లో తొలుత తక్కువ వేతనాలు ఉంటాయి. హైదరాబాద్ లాంటి నగరాల్లో తక్కువ వేతనాలకు చేయలేమని మధ్యలోనే మానేసి వస్తున్నారు. మరికొందరు ప్రైవేటు సంస్థల్లోనూ క్రమక్రమంగా ఉన్నతస్థాయికి చేరినవారు ఉన్నారు. ఎంసీసీలో ఉద్యోగాల స్థితిగతులు.. కంపెనీలపై అవగాహన కలిగించడటం.. ఈ కేంద్రంలో ఇంటర్‌నెట్తో కూడిన కంప్యూటర్లు, ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులకు అనుమానాలు నివృత్తి చేసేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

రాఘవేందర్, జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి

# పది పరీక్షలకు.. మరింత వెసులుబాటు!

పాల్వంచ: పదోతరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. గతంలో పునఃశ్చరణకు విద్యాశాఖ 15 రోజుల గడువు కేటాయించేది. ఫలితంగా పరీక్షల మధ్య వ్యవధి తక్కువగా ఉండటంతో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేవారు. ఈ ఏడాది నుంచి పునఃశ్చరణ గడువును నెల రోజులకు పెంచుతూ ఉన్నతాధికారులు షెడ్యూల్ రూపొందించారు. మార్చి 14న పదోతరగతి వార్షిక పరీక్షలు మొదలై ఏప్రిల్ 16న ముగియనున్నాయి. ఒక పరీక్ష ముగిసిన తర్వాత.. ఆ ఆలోచనల్లోంచి బయటపడి మరో సబ్జెక్టుపై దృష్టి సారించేందుకు సమయం అవసరం. అందుకే పునఃశ్చరణకు తగిన సమయం ఉండేలా అధికారులు షెడ్యూల్ రూపొందించారు.

**అల్పాహారం అందిస్తే ప్రయోజనం**

ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో 16,972 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 12,828 మంది విద్యార్థులు పదోతరగతి అభ్యసిస్తున్నారు.



2026 జనవరి 10లోపు వీరి సిలబస్ పూర్తిచేయాలి. ఇప్పటికే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. చాలాచోట్ల దూరప్రాంతాల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు పరిగడుపున వస్తున్నారు. వీరికి అల్పాహారం అందిస్తే ప్రత్యేక తరగతులపై దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయి.

అల్పాహారం విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. పదోతరగతి విద్యార్థులకు రాగిజావ అందించాలని చెబుతున్నాం. విద్యార్థులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం. ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల యాజమాన్యాలు చొరవ తీసుకొని దాతలను సంప్రదించాలి.
నాగలక్ష్మి, డీఈఓ, భద్రాద్రి కొత్తగూడెం

# మొరంతో సరి.. మొర పట్టేదెవరికి?

నిజామాబాద్ : గత ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. చాలా మండలాల్లో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత పనులతో ప్రయాణ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

రూ. 4 కోట్లతో తాత్కాలిక పనులు : రహదారుల తాత్కాలిక మరమ్మతులకు ప్రభుత్వం రూ. 4 కోట్లు మంజూరు చేయగా, ఆ నిధులతో మొరం వేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఆయా మార్గాల్లో వెళ్లడానికి వాహనదారులు ప్రస్తుతం నానా ఇక్కట్లకు గురవుతున్నారు. దుమ్ము, ధూళి చెలరేగడంతో పాటు మళ్లీ గుంతలు తేలాయి. ఇంకొన్ని చోట్ల పనులు పూర్తికావాల్సి ఉంది. గత నాలుగు నెలలుగా శాశ్వత పనులేవీ అడుగైనా ముందుకుపడడం లేదు. టెండరు ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా రహదారులు, వంతెనలను శాశ్వత ప్రాతిపదికన వెంటనే బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలకు సిరికొండ-ధర్పల్లి మండలాల మధ్య రహదారి చాలాచోట్ల కోతకు గురైంది. కొండూర్ వంతెన వద్ద మొరం వేయించిన అధికారులు.. ఈ మార్గంలో ఇంకా ఎక్కడా మరమ్మతులు చేపట్టలేదు. తుంపల్లి వద్ద కల్వర్టు కొట్టుకుపోగా.. అక్కడ పైపులు వేసి వదిలేశారు. వాడి వాగు వద్ద రోడ్డు కోతకు గురవగా.. కంకర పరిచారు.

బోధన్ మండలం పెంటాకలాన్-అమ్దాపూర్, మావందికలాన్-సాలూర, నవీపేట మండలం యంచ-నందిగామ, నవీపేట-బినోల, ఎడపల్లి మండలం ఎంఎస్‌సీ ఫారం-వడ్డేపల్లి-ధర్మారంతో పాటు దూపల్లి నుంచి వీరన్నగుట్ట రెంజల్ వరకు రోడ్డు ధ్వంసమైంది.



నిజామాబాద్ అర్సపల్లి నుంచి సారంగపూర్ వరకు పలుచోట్ల రోడ్డు ఛిద్రమైంది. కొత్త రోడ్డు నిర్మాణానికి 2023-24లో రూ.6 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు విడుదలకాగా.. పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు.

ప్రతిపాదనలు పంపించాం..

శాశ్వత ప్రాతిపదికన రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాం. కొత్త రోడ్లను త్వరలోనే పూర్తి చేస్తాం. మిగిలిన తాత్కాలిక మరమ్మతులు నాణ్యతతో చేపట్టేలా చూస్తాం.
సర్దార్‌సింగ్, ఎస్ఈ, ఆర్అండ్‌బీ

ఇదీ.. సంగతి

దెబ్బతిన్న రహదారులు : పంచాయతీరాజ్ - 52 , ఆర్అండ్‌బీ - 22

శాశ్వత పనులకు ప్రతిపాదనలు : రూ.32 కోట్లు

విడుదలైన నిధులు: రూ.16 కోట్లు

పురోగతి: టెండరు దశకే ప్రక్రియ పరిమితం

# వరి నాట్లకు ఇతర రాష్ట్రాల కూలీలు



గంగాధర: ఎస్సారెస్పీ కాకతీయ వరద కాలువ, ఎల్లంపల్లి ప్రాజెక్టు, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలతో వ్యవసాయ పంటలకు ఉమ్మడి జిల్లా సాగు నీటి కేంద్రంగా మారింది. వ్యవసాయ బావులు, బోర్ల ఆధారంగా వరినార్లు పోసిన రైతులు నాట్లు ముమ్మరం చేశారు. గతేడాది ఖరీఫ్‌లో కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు అందుబాటులో ఉండటంతో రైతులు ఈ సారి వరినాట్లు, ఇతర పంటల సాగుపై దృష్టి సారించారు. స్థానికంగా కూలీల కొరత, పెట్టుబడుల భారం, సమయభావంతో ఇతర రాష్ట్రాల కూలీలతో వరినాట్లు వేయడంలో రైతులు తలమునకలయ్యారు.

**ఆయా ప్రాంతాల నుంచి**

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బిహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆయా గ్రామాలకు వందలాది మంది కార్మికులు వలస వచ్చారు. ఉమ్మడి జిల్లాల్లోని ఆయా గ్రామాలకు వందలాది వాహనాల్లో వేలాది మంది బృందాలుగా వలస వచ్చి వరినాట్లు వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ సారి దాదాపు 10.50 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

**శ్రమ, పెట్టుబడి ఆదా**

ఎకరాకు మన కూలీలు పది నుంచి 12 మంది వరి నారు తీసి వేస్తుండగా పొరుగు రాష్ట్రం కూలీలు ఇంతేమంది రెండున్నరెకరాల్లో వేస్తున్నారు. 12 మంది కూలీలకు రూ.350 చొప్పున రూ.4,200, ఇద్దరు మగ కూలీలకు రూ.2 వేలు రూ.6,200 ఖర్చు అవుతుండగా వీరు మాత్రం ఎకరాకు రూ.5 వేలు తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల వలస కూలీలే ఎరువులు చల్లుతుండగా రైతులకు శ్రమ తప్పుతుంది.

**నాట్లు పూర్తయ్యే వరకు ఇక్కడే..** గులాబ్, మహారాష్ట్ర

మాది మహారాష్ట్రలోని గడ్చిరౌలి గ్రామం. మా దగ్గర పనులు లేకపోవడంతో రెండు నెలలపాటు ఇక్కడే పనులు దొరుకుతాయని వలస వచ్చాం. రోజుకు మూడెకరాల వరకు నాట్లు వేస్తున్నాం. నారు తీసి పొలం మడుల్లో పరచుకుంటాం. రైతు దుక్కి దున్ని చదును చేసి ఇస్తే సరిపోతుంది. నాలుగేళ్లుగా ఇక్కడకు వచ్చి ఉపాధి పొందుతున్నాం.

**కలిసి వచ్చిన సమయం**

యాదగిరి, గంగాధర, కౌలు రైతు

11 ఎకరాల్లో వరి వేశా. స్థానికంగా కూలీల కొరత, దొరికినా పెట్టుబడుల భారంతో మహారాష్ట్ర కూలీలపై ఆధారపడాల్సి వస్తుంది. నారు తీయడం, పరచడం, ఎరువులు చల్లడంతో శ్రమ తప్పింది.

# వీధి వ్యాపారులకు భరోసా ఏదీ!



జగిత్యాల : పట్టణాల్లో వీధి వ్యాపారుల ఆర్థిక పరిస్థితి దుర్భరంగా మారింది. అధిక వడ్డీకి తెచ్చిన అప్పులు, అరువుతో తెచ్చిన సామగ్రిని విక్రయిస్తుండగా సరైన అమ్మకాలు లేక నష్టాలు వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల కోసం ఆత్మనిర్భర్ నిధి(పీఎం స్వనిధి సమృద్ధి)ని ప్రవేశపెట్టింది. తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం, రాయితీలు కల్పించడం, వ్యాపారుల కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని సంక్షేమ పథకాల్లో చోటు కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశాలు. గుర్తించిన చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీకి రుణం అందజేస్తారు. సక్రమంగా తిరిగి చెల్లించిన వారికి రుణ మొత్తం పెంచి ఇస్తారు. తెల్ల రేషన్ కార్డున్న వారు పథకానికి అర్హులు.

**అన్నింటికీ వర్తింపజేస్తేనే చేయూత**

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, రాయికల్, ధర్మపురి పురపాలక సంఘాల పరిధిలో పీఎం స్వనిధి పథకం అమలు అంతంతమాత్రంగానే ఉంది. ఇప్పటివరకు గుర్తించిన వారిలో చాలా మందికి ఆర్థిక సాయం అందలేదు. గుర్తించిన 12,434 మంది వీధి వ్యాపారులకు సంబంధించి సామాజిక ఆర్థిక ప్రొఫైలింగ్(కుటుంబ ఆర్థిక పరిస్థితుల నమోదు) చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 9,131 మందికి మాత్రమే చేశారు. 20,102 మంది కుటుంబ సభ్యుల్లో 3,303 మందికి మాత్రమే ప్రొఫైలింగ్ పూర్తయింది. మరోవైపు అయిదు పట్టణాల్లో పథకానికి గుర్తించాల్సిన వారు దాదాపు 7,325 మంది వరకున్నట్లు అంచనా. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అన్ని రకాల వీధి వ్యాపారాలకు వర్తింపజేస్తేనే ఆర్థిక చేయూత లభిస్తుంది.

**రెండు నెలలు దాటినా అందలేదు**

పీఎం స్వనిధి పథకం కింద దరఖాస్తు చేసుకొని రెండు నెలలు దాటినా ఇప్పటివరకు రుణం మంజూరు చేయలేదు. ప్రభుత్వం తక్కువ వడ్డీకే రుణమిస్తే మాలాంటి వారికి ఆసరాగా ఉంటుంది. పథకం కింద ఎక్కువ మందికి రుణాలిచ్చి ఆదుకోవాలి.
శాంతారావు, చిరువ్యాపారి, జగిత్యాల

**ఆసక్తి గలవారు సంప్రదించాలి**

ఒక్కో వ్యాపారికి గతంలో మొదట రూ.10 వేల చొప్పున ఇచ్చేవారు. ప్రస్తుతం రూ.15 వేలకు పెంచారు. సక్రమంగా చెల్లిస్తే తదుపరి రూ.25 వేలు, రూ.50 వేల వరకు రుణం అందజేస్తారు. ఆసక్తి గల వారు మెప్మా సిబ్బందిని లేదా బ్యాంకులను సంప్రదించాలి.
రామ్‌కుమార్, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్

# రాయితీ.. పక్కదారి



ఎల్లారెడ్డిపేట: జిల్లాలో మొత్తం 1,75,877 మంది గ్యాస్ వినియోగదారులున్నారు. వీరిలో సింగిల్ కనెక్షన్లు 78,907 ఉండగా.. డబుల్ కనెక్షన్లు 4800 ఉన్నాయి. దీపం పథకం కింద మరో 21,481 కనెక్షన్లున్నాయి. వినియోగదారుల్లో అత్యధిక శాతం మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తోన్న రాయితీ గ్యాస్ పక్కదారి పడుతోంది. గృహ అవసరాలకు వినియోగించాల్సిన సిలిండర్లను ఇతర వాణిజ్య అవసరాలకు వాడుతున్నారు. చివరికి గ్యాస్ ఆధారితంగా నడిచే నాలుగు చక్రాల వాహనాల్లోనూ నింపుతు న్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇలా ఏటా రూ.కోట్ల విలువైన రాయితీ గ్యాస్ పక్కదారి పడుతోంది.

**భారీ ఎత్తున నిల్వ చేసుకొని..** జిల్లా వ్యాప్తంగా 12 ఏజెన్సీల ద్వారా సబ్సిడీ సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. అయితే గ్రామాల్లో కొందరు ఏజెంట్లు రాయితీ గ్యాస్ బండలను వాణిజ్య అవసరాలకు సరఫరా చేస్తున్నారని వినిపిస్తోంది. రాయితీ గ్యాస్ బండ 14 కిలోలు ఉండగా రూ.450కి లభిస్తుంది. 19 కిలోల బరువుగల వాణిజ్య గ్యాస్ బండ రూ.2300 ఉంది. రాయితీకి సంబంధించి చౌకగా లభించడంతో కొందరు భారీగా నిల్వ చేసుకుంటున్నారు. **దళారుల ఆశ్రయం** కొన్ని నాలుగు చక్రాల వాహనాలు గ్యాస్‌తో నడుస్తుంటాయి. సరిపడా గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లు అందుబాటులో లేకపోవడంతో.. కొందరు గ్యాస్ ఆధారిత వాహనదారులు దళారులను ఆశ్రయిస్తున్నారు. సదరు దళారి గ్యాస్‌ను ఎక్కించి.. ధరను నిర్ణయిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అందుబాటులోనే గ్యాస్ లభిస్తుండడంతో వాహనదారులు ఇదే పంథా కొనసాగిస్తున్నారు. అయితే దానిని వాహనాల్లో నింపడం అత్యంత ప్రమాదకరం. నింపే క్రమంలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. చాలామంది కాలిన గాయాలతో ఆసుపత్రుల్లో చేరారు. అయినప్పటికీ వారిలో మార్పు రావడంలేదు.

**వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే చర్యలు**

గృహ అవసరాలకు వినియోగించే రాయితీ గ్యాస్‌ను ఇతర వాణిజ్య అవసరాలకు వాడుతున్నట్లు గుర్తించాం. జిల్లాలోని అన్ని మండలాల్లో ఓ ప్రణాళిక ప్రకారం తనిఖీలు, దాడులు నిర్వహిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నట్లు తేలితే అందుకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. చంద్రప్రకాశ్, డీసీఎస్‌వో

# గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం..

తాడ్వాయి : వచ్చే విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాలలో చేరేందుకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో అయిదు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. 5వ తరగతికి నూతన విద్యార్థులు, ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో బాలబాలికలకు చెందిన 23 పాఠశాలల్లో ప్రవేశాలు పొందవచ్చు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు.

**ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు..**

ప్రవేశాలు పొందాలంటే ప్రస్తుతం చదువుతున్న బోనాఫైడ్, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. ముందు కావాల్సిన తరగతిని ఎంపిక చేసి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు రుసుం రూ.100



చెల్లించాలి. అనంతరం ఆధార్, పుట్టిన తేదీ వివరాలతో అంతర్జాలంలో లేదా మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో దరఖాస్తుకు ఒక్కో చరవాణి నంబరు మాత్రమే పనిచేస్తుంది. ఒకే ఇంట్లో ఇద్దరు విద్యార్థులకు దరఖాస్తు చేయాల్సి వస్తే వేర్వేరు చరవాణి నంబర్లు తప్పనిసరి.

**ఫిబ్రవరి 22న పరీక్ష..**

ఈనెల 11న దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. 2026 జనవరి 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం 2026 ఫిబ్రవరి 22 రోజున ఎంపిక చేసిన పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఒక విద్యార్థికి బదులు మరొకరి ఫొటో, ఇతర వివరాలను సమర్పిస్తే చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.

**విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..**

అయిదు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ ప్రకటనపై అవగాహన కల్పిస్తున్నాం. దరఖాస్తు చేసుకునే ముందు ఏ పాఠశాలలో చేరాలనుకుంటే దానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు పొందవచ్చు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.
సురేఖ, ప్రధానోపాధ్యాయురాలు, తాడ్వాయి

# ఇసుకేస్తే.. రాలేదంతా ధనం!

కొత్తగూడెం : జిల్లాలోని ప్రకృతి సంపద దోపిడీకి గురవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా మాఫియా ఇసుకను తరలిస్తూ జేబులు నింపుకొంటోంది. అక్రమార్కుల విధ్వంసం వల్ల ఓవైపు నదీ గర్భాలు, పర్యావరణ వ్యవస్థ కళ తప్పుతుంటే.. మరోవైపు సర్కారు రావాల్సిన రూ.కోట్ల ఆదాయానికి గండిపడుతోంది. జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట ఇసుక అక్రమ రవాణా కేసులు నమోదవుతుండటమే ఇందుకు నిదర్శనం.

**ఇందిరమ్మ ఇళ్ల ముసుగులో..**

ఇందిరమ్మ ఇళ్లను అడ్డుగా పెట్టుకుని కొంతమంది ఇసుక అక్రమ వ్యాపారానికి తెరలేపారు. లబ్ధిదారులకు అధికారులు ఇస్తున్న టోకెన్ల ద్వారా బయటి వ్యక్తులకు ఇసుక సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా జరగటంలో సంబంధిత అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొందరు అక్రమార్కులు అధికారుల కళ్లుగప్పి రాత్రిపూట ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక తరలిస్తూ.. నిత్యం రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక ఇసుక మాఫియాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దళారులు ఈ దోపిడీలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

కిన్నెరసాని, గోదావరి నదులతో పాటు ముర్రేడు, గోదుమవాగు తదితరా



లు ప్రవహిస్తున్నాయి. వర్షాకాలంలో నదులు, వాగులు తీసుకొచ్చే ఇసుకపై అక్రమార్కులు కన్నేస్తున్నారు. ప్రధానంగా టేకులపల్లి, ఆళ్లపల్లి, బూర్గంపాడు, పాల్వంచ, ములకలపల్లి, దుమ్ముగూడెం, మణుగూరు, లక్ష్మీదేవిపల్లి, భద్రాచలం మండలాల్లో ఇసుక దందా జోరుగా సాగుతోంది. ఆయా మండలాల్లో అక్రమంగా ఇసుక నిల్వ చేసి రాత్రికి రాత్రే లారీల్లో లోడు చేసుకుని సమీప పట్టణాలకు తరలిస్తూ అధిక మొత్తంలో ఆదాయం పొందుతున్నారు. ఈ తంతు వల్ల ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇసుక క్వారీలపై ప్రభావం పడుతోంది.

**సర్కారు ఆదాయానికి గండి..**

అక్రమంగా ఇసుక తరలించటం వల్ల ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో దక్కాల్సిన ఆదాయాన్ని అక్రమార్కులు లాగేసుకుంటున్నారు. ఇది ఆర్థికంగా జిల్లా అభివృద్ధికి అడ్డంకిగా మారుతోంది.

నదులు, వాగుల్లో విచ్చలవిడిగా తవ్వకాలు జరపటం వల్ల నదీగర్భాల లోతు పెరుగుతోంది. దీనివల్ల తీర ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఈ పరిణామం.. వ్యవసాయ భూములు, తాగునీటి వనరులకు భవిష్యత్తులో పెనుప్రమాదకరంగా పరిణమిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా.. మైనింగ్, రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించటం అనేక అనుమానాలకు తావిస్తోంది. కొన్నిచోట్ల అక్రమార్కులను అధికారులు పట్టుకున్నా.. స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడితో వదిలేస్తున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు 'మన ఇసుక-మన వాహనం' కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇప్పటికే బూర్గంపాడులో దీన్ని అమలుచేస్తున్నాం. త్వరలోనే ప్వాలంచ మండలం సోంపల్లి, రంగాపురం, దంతెలబోరు ఎస్సీ కాలనీలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశాం. దినేష్‌కుమార్, మైనింగ్ ఏడీ, భద్రాద్రి కొత్తగూడెం

గరుడ వార్త




# విజ్ఞాన నిధులు.. పరిశోధనా వెలుగులు

హైదరాబాద్ : ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్ వర్సిటీల తరహాలో మన వర్సిటీల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని ప్రభుత్వం సంకల్పించింది. ఓయూ, జేఎన్‌టీయూ, మహిళా వర్సిటీలను రెండేళ్లలో అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు రూ.2,300 కోట్లు ఖర్చు చేయనుంది.

**పరిశోధనలకు పెద్దపీట.. కీలక ఒప్పందాలు**

ఉస్మానియా, మహిళా వర్సిటీ, జేఎన్‌టీయూల్లో కొత్తగా అందుబాటులోకి వచ్చే ప్రయోగశాలల్లో వినూత్న పరిశోధనలు చేపట్టేందుకు వీలుంటుంది. కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలతో ఈ వర్సిటీలు పరిశోధనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వ్యవసాయ, పరిశ్రమల రంగాలు, కాలుష్య నియంత్రణపై పరిశోధనలు నిర్వహిస్తున్న విదేశీ సంస్థలతోనూ



ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు. ఓయూ ఆచార్యులు.. భూసార పరీక్షలు, పొలాల్లో విష పదార్థాలను నిర్మూలించే సూక్ష్మజీవులపై పరిశోధనలు చేసి ఫలితాలు సాధించారు.

**అత్యాధునిక ల్యాబ్‌లు.. డిజిటల్ లైబ్రరీలు**

రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 3 వర్సిటీల్లో అత్యాధునిక ప్రయోగశాలలు, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా మైక్రో బయాలజీ, రసాయన, భౌతికశాస్త్రాల విభాగాల్లో పరిశోధనలు వేగం పుంజుకోనున్నాయి. క్యాన్సర్ నియంత్రణ మందుల తయారీ, అంతరిక్ష పరిశోధనలు, వ్యర్థ జలాల్లో హైడ్రోజన్ ఇంధనం, రుతుపవనాల్లో మార్పులు, ఆహారంలో పోషక విలువలు, ఆరోగ్యకర ఆహారంపై పరిశోధనల్లో కచ్చితత్వం రావడంతోపాటు పేటెంట్లు సాధించే అవకాశాలున్నాయి. డిజిటల్ లైబ్రరీలతో పరిశోధనలకు ఎలాంటి సమాచారమైనా లభిస్తుంది. విదేశీ వర్సిటీల శాస్త్రవేత్తలు, ఆచార్యులతో ఇక్కడి విద్యార్థులు సంభాషించవచ్చు.

# క్లిక్ చేయొద్దు.. చేతులు కాల్చుకోవద్దు



హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ సంస్థల(ఎన్‌బీఎఫ్‌సీ) పేర్లతో బోల్తా కొట్టించి డబ్బు కాజేయడం ఇప్పటివరకూ చూశాం.. ఇప్పుడు మరో ముందడుగు వేసి కొత్త మోసానికి తెరలేపారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) పేరుతో డబ్బు కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ఆర్బీఐ తీసుకొచ్చిన ఉద్గం పథకాన్ని అవకాశంగా మార్చుకుని డబ్బు కొట్టేస్తున్నారు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల కోసమంటూ వివరాలు సేకరిస్తూ మోసగిస్తున్నారు. కొందరు కేటుగాళ్లు ఆర్బీఐ తరఫున మాట్లాడుతున్నా మని.. అనుమానాస్పద లావాదేవీల కారణంగా బ్యాంకు ఖాతాలన్నీ స్తంభింపచేస్తున్నామని బెదిరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే ఈ తరహా మోసాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఆర్బీఐ అధికారులు కాల్స్ చేసి ఎలాంటి వివరాలు సేకరించరనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని సైబర్‌క్రైమ్ పోలీసులు ఫిర్యాదు చేస్తున్నారు.

**ఉద్గం స్కీమ్ అంటే..?**

రెండు నుంచి పదేళ్ల వరకూ ఉపయోగంలో లేని బ్యాంకు ఖాతాల్లోని డబ్బును క్లెయిమ్ చేసుకోవడానికి ఆర్బీఐ ఈ పథకాన్ని ప్రారంభించింది. సంబధిత శాఖకు వెళ్లి కేవైసీ పత్రాలు అందజేసి తీసుకోవచ్చు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లపై అవగాహన కోసం ఆర్బీఐ సందేశాలు పంపిస్తోంది. పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తోంది.మోసాలు చేస్తున్నారిలా..

ఆర్బీఐ లాగే సైబర్ నేరగాళ్లు ఎస్ఎంఎస్, వాట్సప్‌లో మోసపూరిత లింకులతో సందేశాలు పంపిస్తున్నారు.

పొరపాటున క్లిక్ చేస్తే నకిలీ వెబ్‌సైట్ ద్వారా వ్యక్తిగత వివరాలతోపాటు యాక్టివ్‌లో ఉన్న ఖాతాల వివరాలు సేకరిస్తున్నారు.

ఈ వివరాల ఆధారంగా ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ.. ఖాతాల యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు అడిగి డబ్బంతా కాజేస్తున్నారు.

బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డు లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నాయని, మోసాలకు ఉపయోగిస్తున్నట్లు ఆధారాలున్నాయని, మరో రెండు గంటల్లో మీ పేరుతో ఉండే అన్ని బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు.


మరిన్ని వివరాల కోసం 9 ప్రెస్ చేయాలని వాయిస్ కాల్ వస్తోంది. పొరపాటున ఈ నంబరు ప్రెస్ చేస్తే సైబర్ నేరగాళ్లు లైన్‌లోకి వచ్చి వేర్వేరు కారణాలతో డబ్బు కొట్టేస్తున్నారు.

**ఫిర్యాదు చేయండిలా..**

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల కోసం వెబ్‌సైట్లను నమ్మకుండా నేరుగా సంబంధిత బ్రాంచిలకువెళ్లి ఆరా తీయాలి.

ఒకవేళ సైబర్ నేరగాళ్లకు చిక్కి మోసపోతే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ, %www.cybercrime.gov.in% ద్వారా ఫిర్యాదు చేయాలి.

# అంతా దుమ్మే..!



మిర్యాలగూడ : ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా ఆర్టీసీని బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంట్లో భాగంగానే మహాలక్ష్మి పథకం ద్వారా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల్లో ప్రయాణికులు పెరగడంతో పాటు ఆర్టీసీకి ఆదాయం సైతం పెరిగింది. అయితే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను పెంచకపోవడంతో ఉన్న బస్సుల్లోనే కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. బస్సుల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

**అపరిశుభ్రతతో అవస్థలు..**

ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల్లో మొత్తం 716 బస్సులు ఉండగా.. అనేక బస్సులు అపరిశుభ్రంగా ఉన్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్సు బయలుదేరేటప్పుడు తప్పనిసరిగా కడిగి లోపల ఊడ్చి పంపిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ అనేక బస్సుల్లో సీట్లపై, అద్దాలపై, లోపల దుమ్ము, ధూళి పేరుకుపోతుందని ప్రయాణికులు చెబుతున్నారు. బీ డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో సీటు కవర్లను ఏళ్ల తరబడి మార్చకపోవడంతో ఒక రకమైన దుర్వాసన వస్తూ కూర్చోలేకపోతున్నామని ప్రయాణికులు అంటున్నారు. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే విద్యుత్తు సూపర్ లగ్జరీ బస్సులు మరింత అధ్వానంగా ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు. బస్సులో అద్దాలపై ఉమ్మి వేసిన మరకలు సైతం ఉండి ఇబ్బందులు పడుతున్నారు.

**బస్సుల శుభ్రతకు చర్యలు...** – జాన్‌రెడ్డి, ఆర్ఎం, నల్గొండ

ఆర్టీసీ బస్సుల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. బస్సుల్లో దుర్వాసన రాకుండా కెమికల్ వాషింగ్ కూడా చేయిస్తున్నాం. మరోసారి దీనిపై దృష్టి సారిస్తాం.

# గర్భాశయ ముఖద్వార క్యాన్సర్.. ఇక పరార్!



హైదరాబాద్: మహిళల్లో ఎక్కువగా వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. 14 ఏళ్లు నిండి 15 ఏళ్లలోపు బాలికలందరికీ హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) వ్యాక్సిన్ ఉచితంగా అందించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా గ్రేటర్ వ్యాప్తంగా హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో త్వరలో పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది.

మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌తో పాటు గర్భాశయ ముఖద్వార(సర్విక్స్) క్యాన్సర్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముందే గుర్తించడం ద్వారా వీటిని పూర్తిగా నియంత్రించవచ్చు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకుంటే గర్భాశయ క్యాన్సర్‌తో పాటు ఇతర క్యాన్సర్ల నుంచి మహిళలకు పూర్తి రక్షణ ఉంటుంది. అవగాహన లేక చాలామంది ఈ టీకాకు దూరంగా ఉంటున్నారు. అవగాహన లేమి, బిడియం, ఇతర పరిస్థితుల వల్ల రొమ్ము, సర్విక్స్ క్యాన్సర్లున్నా బయటకు చెప్పడం లేదు. ప్రస్తుతం ఆసుపత్రికి వస్తున్న వారిలో 70–80 శాతం కేసులు బాగా ముదిరిపోయే దశలో ఉంటున్నాయి. చికిత్స కూడా కష్టతరం కావడంతో ఎక్కువ శాతం మరణాలు సంభవిస్తున్నాయి. మహిళలకు ఈ క్యాన్సర్లు సోకితే ఆ ప్రభావం కుటుంబం మొత్తంపై పడుతోంది. ఈ నేపథ్యంలోనే సర్విక్స్ క్యాన్సర్ నుంచి పూర్తి రక్షణ కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచితంగా వేసేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం ప్రైవేటులో రెండు డోసులిస్తుండగా ప్రభుత్వం మాత్రం తొలుత సింగిల్ డోసే పంపిణీ చేయనుంది. అర్హత ఉన్న ప్రతి బాలికకు ఈ టీకా వేసేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

**90 రోజుల పాటు పంపిణీ**

–డాక్టర్ పి.శ్రీధర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, హైదరాబాద్

గ్రేటర్‌లోని బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించనున్నాం. 90 రోజులపాటు ఈ కార్యక్రమం నడుస్తుంది. ఎప్పటి నుంచి అమలు చేస్తారనేది త్వరలో ప్రభుత్వం ప్రకటిస్తుంది. సింగిల్ డోసు తీసుకున్నాక సర్విక్స్ క్యాన్సర్ నుంచి 12ఏళ్ల వరకు రక్షణ ఉంటుంది. అర్హులైన బాలికలంతా నిర్భయంగా వ్యాక్సిన్ తీసుకోవాలి.

# ప్రతినిధుల దన్ను.. రాబందుల కన్ను

నల్గొండ : నీలగిరిలో మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరుతో దర్జాగా దందా సాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నియంత్రించాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి.

జిల్లా కేంద్రంలో నిత్యం అక్రమంగా మొరం తవ్వడంతో అన్నేశ్వరమ్మ, కాపురాల కొండలు కరిగిపోతున్నాయి. ప్రధానంగా పట్టణ సమీపంలోని అన్నేశ్వరమ్మ గుట్టపై రాబందుల కన్ను పడింది. రాత్రి పగలూ.. ప్రకృతి సంపదను కొల్లగొడుతూ జేబులు నింపుకొంటున్నారు. కొండలకు రంధ్రం చేసి అక్రమంగా వెంచర్లకు, రోడ్లకు, పునాదులకు తరలిస్తున్నారు. ఇలా ఒక్కో ట్రిప్పు మొరం మార్కెట్‌లో రూ.4500 చొప్పున విక్రయిస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. దేవరకొండ రోడ్డు మార్గంలోని వైకుంఠధామం పక్కన గుట్టలను సైతం పొక్లెయిన్ సాయంతో కొల్లగొడుతూ కాసులు దండుకుంటున్నారు. అక్రమంగా తవ్వడంతో భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. అనుమతి లేకుండా ప్రకృతి సంపదను తరలించడం చట్టవిరుద్ధమైన చర్యని జిల్లామైనింగ్ అధికారి జాకబ్ శ్యామూల్ అన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమంగా మొరం తరలించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. **మౌనంగా మైనింగ్‌శాఖ** జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. వీటికి తోడు రహదారుల నిర్మాణాలకు, ఇళ్ల నిర్మాణాలకు మొరం అవసరం ఉంటుంది. దీనిని ఆసరా చేసుకున్న కొంతమంది సంపాదనే ధ్యేయంగా ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతూ గుట్టలను మాయం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. నాయకులు, అధికారులకు ముడుపులు చెల్లిస్తూ అక్రమాలకు కొనసాగిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గనులశాఖకు చెల్లించాల్సిన రాయల్టీ పన్ను చెల్లించకుండా పెద్ద యంత్రాలతో సాగిస్తున్న దందాను నియంత్రించాల్సిన అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు కేసులు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

# నిధుల లేమి.. ఖాళీల భర్తీకేదీ హామీ!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. జనరల్ పుస్తకాలు, కొత్త కొత్త నవలలు కొనుగోళు నిలిచిపోయాయి. కొన్నేళ్లుగా పోస్టులు భర్తీ కాకపోవడంతో మండల స్థాయిలో గ్రంథాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇన్‌ఛార్జిలతో కాలం వెళ్లదీస్తుండటంతోపాటు సకాలంలో గ్రంథాలయ సెస్ రాకపోవడంతో ఉన్న నిధులతో నెట్టుకొస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో నాలుగు కేంద్ర గ్రంథాలయాలతోపాటు శాఖ గ్రంథాలయాలు పని చేస్తున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ప్రతి రోజు 600–750 మంది, జగిత్యాలలో 100–150 మంది, రాజన్న సిరిసిల్లలో 100–200 మంది, పెద్దపల్లిలో 60–80 మంది వస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో డైరెక్టరేట్ గ్రంథాలయంలో కమిటీ తీర్మానం మేరకు పుస్తకాలు కొనుగోలు చేస్తారు. సామాజిక చైతన్యం, సాహిత్య పుస్తకాలు, నవలలను కమిటీ తీర్మానం మేరకు కొనుగోలు చేస్తారు. దాదాపు పదేళ్ల నుంచి ఇలాంటి పుస్తకాలు కొనుగోళ్లు నిలిచిపోయాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయాల్లో నిరుద్యోగులు కోరిన ఆన్ డిమాండ్ పుస్తకాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. గ్రంథపాలకుల పోస్టుల భర్తీ పదేళ్లుగా చేపట్టడం లేదు. ఈ పదేళ్లలో చాలా మంది ఉద్యోగ విరమణ పొందడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఫలితంగా శాఖ గ్రంథాలయాలు ఇన్‌ఛార్జిల పాలనలో నడుస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో గ్రేడ్–3 శాఖ గ్రంథాలయాల పాలకుల పోస్టులు 36 ఉండగా 8 మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా పోస్టులన్నీ ఖాళీలు ఉండగా ఔట్ సోర్సింగ్ కింద ఏడుగురు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రంథాలయాల్లో 66 పోస్టులకు 27 మంది మాత్రమే పని చేస్తున్నారు. గ్రేడ్–1, గ్రేడ్, అటెండర్, తదితర పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంకు ఒక్క కార్యదర్శి పోస్టు ఉంది.

ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు

ఎ.సరిత, కార్యదర్శి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ

సాధారణ, జనరల్ పుస్తకాలు కొనుగోలు ఇటీవల కాలంలో చేయడం లేదు. రాష్ట్ర కమిటీ ఈ పుస్తకాలు కొనుగోలు చేయాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రస్తుతం నిరుద్యోగ అభ్యర్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆన్ డిమాండ్‌లోనే పుస్తకాలు కొనుగోలు చేస్తున్నాం. పోస్టుల భర్తీ ప్రభుత్వ పరిధిలో ఉంది. ఉన్నవారితోనే విధులు నిర్వహించుకునేలా ప్రణాళిక చేసుకుంటున్నాం.

# కళ్లెదుటే సంపద..తీరేలా ఆపద..!

నల్గొండ : పల్లెలను పరిశుభ్రంగా మార్చాలని గత ప్రభుత్వం సంకల్పించింది. ప్రజారోగ్యంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూర్చేలా ప్రణాళిక రూపొందించింది.

లక్ష్యం ఇలా: గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కంపోస్టు ఎరువులు తయారు చేసి రైతులకు కిలో రూ.10 చొప్పున విక్రయించి ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. దీనికోసం ప్రతి గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలను నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది. పురోగతి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 95 శాతానికి పైగా పూర్తయ్యాయి.

అప్పటి కార్యాచరణ: పల్లె ప్రగతిలో గ్రామాల్లో చెత్త, వ్యర్థ పదార్థాల



నిర్వహణ కీలకమైంది. దీని ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రభుత్వం చెత్తను సేకరించేందుకు ట్రాక్టర్లు కొనుగోలు చేసింది. రూ.లక్షలు వెచ్చించి ఇంటింటికీ రెండు చెత్త బుట్టలు పంపిణీ చేసింది. చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి కంపోస్టు ఎరువు తయారు చేయాలని సూచించింది.కానీ ఎక్కడా ఇది సక్రమంగా అమలు కావడంలేదు.

ఇలా చేయాలి: ప్రతి సెగ్రిగేషన్ షెడ్డులో కూరగాయలు, ఆకుకూరల వ్యర్థాలు, కుళ్లిన పండ్లు తదితర వాటిని తడిచెత్తగా వేరు చేయాలి. ఇనుము, ప్లాస్టిక్, అట్టముక్కలు ఇతరత్ర వాటిని పొడి చెత్తగా మార్చాలి. ఇలా వేరు చేసిన వ్యర్థాల నుంచి కంపోస్టు ఎరువులను తయారు చేయాలి.కొత్త పాలకులు ఇలా చేయాలి: గత పాలకవర్గాల, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఈ ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో మెజారిటీ గ్రామ పంచాయతీల్లో ముందుకు సాగడం లేదు. వచ్చే కొత్త పాలకులు దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియ వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడటంతో పాటు కంపోస్టు ఎరువుల తయారీ వల్ల పంచాయతీలకు సంపద సమకూరే అవకాశం ఉంటుంది.

# పెద్దాసుపత్రిలో.. పెరగనున్న సేవలు

సూర్యాపేట : సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజేహెచ్)లో మొత్తం 400 పడకలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 350 జీజేహెచ్, మరో యాభై పడకలు మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో భాగంగా ఉన్నాయి. ఇలా ప్రతి వంద పడకలకు 45 చొప్పున 180 మంది మాత్రమే కార్మికులు అందుబాటులో ఉన్నారు. ఇందులో 76 మంది పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం కరవైంది. 400 పడకలకు 52 మంది మాత్రమే పేషెంట్ కేర్‌లు ఉండటంతో రోగులకూ సకాలంలో సరైన సేవలు అందడం లేదు. సెక్యూరిటీ సిబ్బంది 52 మంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. సర్కారు ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, రోగులకు మెరుగైన వైద్య సేవలు, పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. పడకల ఆధారంగా పారిశుద్ధ్య సిబ్బంది, పేషెంట్ కేర్, భద్రతా సిబ్బంది సంఖ్యను పెంచేందుకు మార్గదర్శకాలను రూపొందించేందుకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవల ఈ కమిటీ పలు



సూచనలు చేస్తూ మార్గదర్శకాలను రూపొందించిన విషయం విదితమే.

ఇక వంద పడకలకు 65 మంది కార్మికులు: సర్కారు ఆసుపత్రుల్లో ప్రతి వంద పడకలకు 65 మంది సిబ్బందిని నియమించేందుకు కొత్తగా టెండర్లను పిలవడానికి కమిటీ సూచనలు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం టెండర్లను పిలిచేందుకు కరసత్తు ప్రారంభించింది. దీంతో ప్రతి 20 మంది చొప్పున పెరిగే అవకాశం ఉంటుంది. అంటే సూర్యాపేట జీజేహెచ్‌కు మరో 80 మంది కార్మికులు పెరగనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతి పడకకు రూ.7,500 చొప్పున గుత్తేదారులకు చెల్లిస్తోంది. ఈ మొత్తాన్ని రూ.పది వేలకు పెంచేందుకు కమిటీ నిర్ణయించింది. ఇలా చేయడం ద్వారా కార్మికులు సంఖ్య పెరగడంతోపాటు వారికి వేతనాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

# జోరుగా.. రుణాల పంపిణీ..!

ఖమ్మం : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారుల చొరవతో వీధి వ్యాపారులకు రుణాల పంపిణీ ప్రక్రియ జోరందుకుంది. మూడు విడతలుగా ఇచ్చే రుణాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇప్పటివరకు 52,934 మందికి రూ.91.56కోట్లు అందజేశారు. మొదటి విడతలో రూ.10వేలు లేదా రూ.15వేలు, రెండో విడతలో రూ.25వేలు, మూడో విడతలో రూ.50వేల చొప్పున పంపిణీ చేశారు. అనంతరం అవసరమైన వారికి క్రెడిట్ కార్డ్ అందించేందుకు చర్యలు చేపట్టారు. కొవిడ్ సమయంలో ప్రారంభించిన



పీఎం స్వనిధి కింద ఈ పథకాన్ని నగరపాలికలు/పురపాలికల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది.

కొత్తగా ఏర్పడిన అశ్వారావుపేట, కల్లూరు, ఏదులాపురం పురపాలికలను మినహాయిస్తే మిగిలిన వాటన్నింటిలోనూ నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు మెప్మా అధికారులు, ఆర్పీలు చేస్తున్న కృషి సత్ఫలితాలు ఇస్తోంది. రుణాలను వినియోగించుకొని వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను బలోపేతం చేసుకున్నారు.

## అధికలోడు.. అతివేగం.. అదుపేది?

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ అతివేగం.. పరిమితికి మించి కంకర రవాణా చేస్తుండటమే కారణమని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ టిప్పర్ వాహనాలు నిబంధనలు ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా చక్కర్లు కొడుతున్నాయి. ఇన్ని జరుగుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో నిర్మాణాలు పెద్దఎత్తున జరుగుతుండటంతో.. కంకరతో పాటు భారీ బండరాళ్లను తరలించడానికి ఈ వాహనాలను వినియోగిస్తున్నారు. ఆయా వాహనాల్లో రెట్టింపు లోడు తరలిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

**ఈ ఏడాది 2,200 కేసుల నమోదు**

గ్రేటర్ పరిధిలో ఈ ఏడాది ప్పటి వరకు అధిక లోడు తరలించిన టిప్పర్ వంటి గూడ్స్ వాహనాలపై 2,200 కేసులు నమోదు చేశారు. ఈ భారీ వాహనాల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా నగరవాసులు బెంబేలెత్తున్నారు. సాధారణంగా భారీ వాహనాలు నగరంలోనికి రాత్రి



10 గంటల తర్వాత ప్రవేశించాలనే నిబంధన ఉన్నా.. రాత్రి 8.30 నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. కూడళ్లు, ఇరుకైన దారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

**తరలింపులో నిర్లక్ష్యం**

టన్నుల కొద్దీ ఇసుక, బండ రాళ్లు, కంకర తరలిస్తున్న వాహనాలు భద్రతను గాలికి వదిలేస్తున్నాయి. వెనుకవైపు డోర్‌ను సరిగ్గా మూయకుండా నిర్లక్ష్యంగా తరలిస్తున్నారు. కాస్త జారినా వెనుక వచ్చే వాహనదారుల ప్రాణాలకే ముప్పు. టన్నుల బరువు, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా రోడ్లు ధ్వంసం అవుతున్నాయి.

## పార్కు సిద్ధం.. ప్రవేశం నిషిద్ధం!

హైదరాబాద్: మహానగరంలో హిమాయత్‌సాగర్ చెంత హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఏకోపార్కు ప్రారంభానికి ఎదురు చూస్తోంది. కార్తిక మాసంలోనైనా అందుబాటులోకి తెస్తే కుటుంబాలతో వెళ్లి ప్రకృతిలో గడిపేందుకు అవకాశం ఉంటుందని నగర వాసులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. శంషాబాద్ సమీపంలోని కొత్వాల్‌గూడలో 85 ఎకరాల విస్తీర్ణంలో ఏకో పార్కును దాదాపు రూ.75 కోట్లతో హెచ్‌ఎండీఏ తీర్చిదిద్దింది. పార్కు సిద్ధమైనా సందర్శకులను అనుమతించడం లేదు. తొలుత సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నప్పటికీ కార్యక్రమం వాయిదా పడుతూ వస్తోంది. ఆకట్టుకునే పక్షుల గ్యాలరీ.. పార్కులో వివిధ రకాల పక్షుల గ్యాలరీ విశేషంగా ఆకట్టుకుంటోంది. వివిధ దేశాల నుంచి వేయి రకాల పక్షులను తెచ్చిపెట్టారు. పార్కును ప్రారంభిస్తే సందర్శకులకు ఇవి కనువిందు చేయనున్నాయి. ఇదే పార్కులో సాహస క్రీడల కోసం 6 ఎకరాల్లో రకరకాల అంశాలను సిద్ధం చేశారు. అతిపెద్ద అక్వేరియం లేనట్టే... ఇదే పార్కులో దేశంలోనే అతిపెద్ద భూగర్భ అక్వేరియం ఏర్పాటు చేయాలని తొలుత హెచ్‌ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో రకరకాల సముద్ర జీవులు, చేపలు, సరీసృపాలు లాంటివి ఈ అక్వేరియంలో అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ అక్వేరియం ఏర్పాటుకు గ్లోబల్ టెండర్లు



పిలిచినప్పటికీ పెద్దగా స్పందన రాకపోవడంతో ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టును విరమించుకున్నట్లు తెలుస్తోంది.

**ఇవీ ప్రత్యేకతలు...**

85 ఎకరాల్లో పచ్చిక బయళ్లతో పార్కు
రకరకాల పక్షులతో అవియరీ(గ్యాలరీ)
బోర్డు వాక్, ఎలివేటెడ్ వాక్ ఏరియా (2.5 కి.మీ)
బటర్‌ఫ్లై పార్కు, వివిధ రకాల వృక్షాలు
రకరకాల పువ్వులతో పెద్ద తోట
అడ్వెంచర్ జోన్
ఓపెన్ ఎయిర్ థియేటర్, ఫుడ్‌కోర్టు
లగ్జరీ ఫుడ్ కాటేజీలు, మినీ కన్వెన్షన్ సెంటర్

## క్యూఆర్ కోడ్ స్కాన్‌తో తితిదే సమాచారం



హిమాయత్‌నగర్: భక్తులు ఎప్పటికప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) సమాచారం తెలుసుకునేలా హిమాయత్‌నగర్ (లిబర్టీ)లోని తితిదే దేవాలయం వద్ద 'క్యూఆర్ కోడ్'లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. భక్తులు ఆ క్యూఆర్ కోడ్‌లను చరవాణితో స్కాన్ చేస్తే చాలు ఎస్ఎస్‌డీ టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు, స్పెషల్ దర్శనం, సేవా ఎలక్ట్రానిక్ డీప్, శ్రీవాణి టికెట్లు, వసతి తదితరాల సమాచారం కళ్ల ముందు ప్రత్యక్షమవుతుంది. శ్రీవారి సేవలు, టికెట్ల బుకింగ్ కోసం సంప్రది ంచాల్సిన అధికారిక వెబ్‌సైట్ (%https://ttdevasthanams.a p.gov.in%) యూఆర్ఎల్‌ను కూడా ఫ్లెక్సీపై ముద్రించారు. ఏదైనా సమాచారాన్ని తెలుసుకోవడానికి, సేవలు పొందటానికి తితిదే అధికారిక వెబ్‌సైట్, సామాజిక మాధ్యమ పేజీలను మాత్రమే ఉపయోగించాలని తితిదే అధికారులు సూచిస్తున్నారు.

# వణికిస్తున్న వల్లూరు యూటర్న్



చేగుంట: వల్లూరు యూటర్న్ అంటే ప్రతి ఒక్కరికి హడల్.. ఇక్కడ రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. గడిచిన మూడు దశాబ్దాల్లో సుమారు 150 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. మరెందరో క్షతగాత్రులు అయ్యారు. పలు కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయి. గతంలో జరిగిన ఒక ప్రమాదంలో వల్లూరు గ్రామానికే చెందిన సుమారు 12 మంది మృతిచెందడం గమనార్హం.

**ఎలా జరుగుతున్నాయంటే..**

చేగుంట వైపు నుంచి వల్లూరుకు యూటర్న్ తీసుకొని వెళ్లే క్రమంలో చేగుంట నుంచి, నిజామాబాద్ నుంచి వాహనాలు వేగంగా వచ్చి ఢీకొంటున్నాయి. బైక్‌లు, సైకిల్‌పై, నడుచుకుంటూ వెళ్తున్న వారు కూడా మరణించడం విచారకరం.

**సర్వీస్ రోడ్డు ఎందుకంట..**

ఆర్వోబీ కోసం గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులకు తరచూ విన్నవిస్తే రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్డు మంజూరు చేశారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు.

**విషాదం నింపిన ఘటనలు**

వల్లూరుకు చెందిన చాకలి కిష్టయ్య అనే రైతు 2024 జనవరి 24న సైకిల్‌పై పొలం వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. ఆయన అల్లుడు కిషన్ 2019 డిసెంబరు 5న బైక్‌పై గ్రామానికి వస్తుండగా వాహనం ఢీకొని మరణించాడు. వీరి కుటుంబాలు దయనీయ పరిస్థితిలో ఉన్నాయి. ఇల్లు కూడా లేకపోవడంతో అద్దెకు ఉంటున్నారు. కుటుంబ పోషణ భారమైంది.

**ఇల్లు కట్టుకోలేని పరిస్థితి**

గ్రామానికి చెందిన వడ్ల రమేష్ 2024 డిసెంబరు 3న పని ముగించుకొని చేగుంట నుంచి వస్తున్నాడు. వల్లూరు వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో వాహనం ఢీకొనటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య లత, కుమారుడు వంశీ ఉన్నారు. ప్రస్తుతం ఉరుస్తున్న ఇంట్లో ఉంటున్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా కట్టుకునేందుకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. రైతుబీమా వస్తే అప్పులకే సరిపోయింది.

**హతవిధి.. ఈ శోకం తీరనిది**

ఆనందాస్ శేఖర్ అనే యువకుడు 2025 ఆగస్టు 14న బైక్‌పై వస్తుండగా యూటర్న్ వద్ద జరిగిన ప్రమాదంలో మరణించాడు. ఆ సమయంలో అతడి భార్య నవ్య ఆరు నెలల గర్భిణి. ఇక్కడ ఆర్వోబీ నిర్మిస్తే తన కొడుకు బతికేవాడని అతని తల్లిదండ్రులు బాల్‌నర్సవ్వ, నాగభూషణం బోరున విలపించారు. నాగభూషణం తమ్ముడి కుమారుడు మధు సైతం మూడేళ్ల క్రితం ఇక్కడే జరిగిన ప్రమాదంలో చనిపోయాడు. అప్పుడు ఆయన భార్య కూడా గర్భిణిగా ఉన్నారు.

ఎన్‌హెచ్ 44 ఇలా..
జిల్లా పరిధి: 55 కి.మీ.
ఎక్కడి నుంచి ఎక్కడికి.. కాళ్లకల్ నుంచి దామెరచెరువు
ప్రమాదకరమైన యూటర్న్ వల్లూరు వద్ద
ప్రాణాలు కోల్పోయింది: సుమారు 150 మంది
ప్రమాదాలు తగ్గాలంటే వల్లూరు వద్ద ఆర్వోబీ నిర్మాణం చేపట్టాలి

## అనుమతులు లేకుండానే.. అడ్డగోలుగా కనెక్షన్లు



హైదరాబాద్: నగరంలో విద్యుత్తు కనెక్షన్ కావాలంటే జీహెచ్‌ఎంసీ, శివార్లలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఇంటి నిర్మాణ అనుమతి పత్రం ఉండాలి. నిర్మాణం 10 మీటర్లు దాటితే ఆయా సంస్థల నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) తప్పనిసరి. ఓసీ లేకున్నా.. నకిలీ ఓసీ సమర్పించి విద్యుత్తు కనెక్షన్లు పొందుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. వీటిపై టీజీఎస్పీడీసీఎల్ విజిలెన్స్ విభాగం విచారణ జరపగా విస్తుపోయే అక్రమాలు వెలుగుచూశాయి. సైబర్‌సిటీ సర్కిల్‌లోని గచ్చిబౌలి టీఎన్‌జీవో, గౌలిదొడ్డి, కంచ గచ్చిబౌలి, నానక్‌రాంగూడ తదితర ప్రాంతాల్లో అనుమతులే లేని భవనాలకు విద్యుత్తు కనెక్షన్లు, ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారు.

**యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు**

ఐటీకారిడార్ కేంద్రంగా ఉన్న సైబర్‌సిటీ సర్కిల్‌లో ఇటీవల పలువురు విద్యుత్తు ఇంజినీర్లు ఏసీబీకి పట్టుబడ్డారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసులో జైలు కెళ్లారు. పలువురు అధికారులు లక్షలు ఖర్చుచేసి ఈ ప్రాంతంలో పోస్టింగ్ తెచ్చుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. ఓసీ, అనుమతి లేకుంటే వారి పంట పండినట్లే. విజినెన్స్ విచారణలో ఇక్కడ పనిచేసిన లైన్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఏడీఈ వరకు నిబంధనలు ఉల్లంఘించారని గుర్తించింది. వీరిపై చర్యలు తీసుకోవాలని సీఎండీకి నివేదిక ఇచ్చింది.

**అవకతవకల చిట్టా ఇది..**

గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీ ఫేజ్2లో ఒక ప్రభుత్వ ఉద్యోగి జీ4 అంతస్తుల భవనం నిర్మించారు. ఆ ఇంటికి నాలుగు విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. అసలు భవనం నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ అనుమతి లేదని టీజీఎస్పీడీసీఎల్ విచారణలో తేలింది. టీఎన్‌జీవో సొసైటీ అనుమతి తీసుకుని నాలుగంతస్తుల భవనం కట్టారు. ఇది పూర్తిగా అక్రమ నిర్మాణం. అప్పుడు అక్కడ పనిచేసిన సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేశ్ క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదిక లేకుండా మీటర్లు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా నిర్మించిన మరో భవనానికి, జర్నలిస్టు కాలనీలో కట్టిన మరో భవనానికి మీటర్లు జారీ చేశారు.

టీఎన్‌జీవో కాలనీలోనే 10 మీటర్లు పైన కట్టిన మరో భవనానికి ఓసీ లేకుండా అప్పటి గచ్చిబౌలి ఏఈ, ప్రస్తుతం సైఫాబాద్ సీబీడీ ఏఈగా విధులు నిర్వహిస్తున్న పి.వి.బి.వేణుగోపాల్ మీటర్లు జారీ చేశారు. మరో భవనానికి ఏకంగా ప్యానల్ బోర్డు జారీ చేశారు.

కంచ గచ్చిబౌలిలో రెండు భవనాలు, నానక్‌రాంగూడలో కట్టిన మరో బహుళ అంతస్తుల భవనాలకు జీహెచ్‌ఎంసీ అనుమతులే లేవు. 10 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో కట్టారు. ఓసీ లేకున్నా.. వీటికి గచ్చిబౌలి ఆపరేషన్స్ ఏఈ టి.భాస్కరరావు ప్యానెల్‌బోర్డులు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారు.

గౌలిదొడ్డిలో జీ5 భవనానికి జీహెచ్‌ఎంసీ అనుమతే లేదు. ఏఈ టి.వెంకట్ నారాయణ రెడ్డి దీనికి ప్యానల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేశారు.

## ఫ్యాబ్‌సిటీలో ఐటీ సంస్థలు.. పరిశ్రమలు



హైదరాబాద్ : బాహ్యవలయ రహదారికి సమీపంలోని తుక్కుగూడ ఫ్యాబ్‌సిటీలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వీటిని భారత్ ఫ్యూచర్‌సిటీలోని సంస్థలకు అనుసంధానం చేసేలా రెవెన్యూ, పరిశ్రమల శాఖ అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఫ్యాబ్‌సిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలోని 922 ఎకరాలను సెజ్ నుంచి మినహాయించడంతో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. ఫ్యాబ్‌సిటీకి 15 కి.మీ. దూరంలోనే భావినగరం నిర్మాణమవుతున్న నేపథ్యంలో.. మార్గమధ్యలో మరిన్ని ఐటీ సంస్థలు, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ సంస్థలు ఏర్పాటయ్యేలా, ఏడాదిలోపు రూ.5వేల కోట్ల పెట్టుబడులు రాబట్టేలా కార్యచరణ రూపొందించారు

సెమీ కండక్టర్లు... ఇంధన నిల్వ కేంద్రాలు ఇరవై ఏళ్ల క్రితం ఫ్యాబ్‌సిటీ నిర్మాణ దశలో సెమీ కండక్టర్ల పరిశ్రమలకు ఆ శాఖ అధికారులు ప్రాధాన్యమిచ్చినా ఆశించినస్థాయిలో రాలేదు. వెయ్యి ఎకరాలు మిగిలిపోయాయి. సెమీకండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలంటూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచించడంతో.. ఫ్యాబ్ సిటీలో సెమీ కండక్టర్లు, ఇంధన నిల్వల కేంద్రాలకు ప్రాధాన్యమివ్వాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. ఐటీ, ఎలక్ట్రానిక్ సంస్థలు, పరిశ్రమలకూ పాధాన్యమివ్వనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా.. పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభించనుందని అధికారుల అంచనా.

**ప్రత్యేక రహదారులు... మౌలిక సదుపాయాలు**

ఫ్యాబ్‌సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీల మధ్య ప్రత్యేక రోడ్లు, మౌలికసదుపాయాలను అధికారులు కల్పించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్– శ్రీశైలం రోడ్డు, శంషాబాద్–గచ్చిబౌలి బాహ్యవలయ రహదారులు మాత్రమే ఉన్నాయి. వీటితోపాటు ఫ్యూచర్ సిటీకి కొంగర్‌కలాన్ నుంచి 330 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రోరైలునూ అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నారు. శంషాబాద్ నుంచి తుక్కుగూడ మీదుగా కలెక్టరేట్ వరకు రహదారి కూడా అందుబాటులోకి రానుంది. తద్వారా ఫాక్స్‌కాన్, మరో రెండు పరిశ్రమలకు అనుసంధానం ఏర్పడనుంది.

## వ్యాపార విస్తరణకు చేయూత

పరిగి : వీధి విక్రయదారులకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజన పథకాన్ని అమలు చేస్తోంది. అధిక వడ్డీల భారం నుంచి వీరిని గట్టెక్కించి స్వశక్తితో నిలదొక్కుకునేలా చేయడం దీని ఉద్దేశం. ఈ క్రమంలోనే మూడు విడతలుగా వీధి వ్యాపారులను గుర్తించి ఆర్థిక సాయం అందజేస్తోంది. వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు రాయితీ సదుపాయాన్ని కల్పిస్తోంది. దీన్ని కొందరు చక్కగా వినియోగించుకుంటూ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. తద్వారా వారి కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు. నాలుగు పురపాలికల్లో 7,887 మంది వీధి వ్యాపారులను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు వారికి సుమారు రూ.2.76 కోట్లు రుణంగా అందించారు. కొత్తగా క్రెడిట్‌కార్డులు అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

**నాలుగో విడతలో ఇలా..**

ఇప్పటివరకు ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజన పథకాన్ని పట్టణ ప్రాంతాల్లోనే అమల్లో ఉంది. ఎంపిక చేసిన వీధి వ్యాపారులకు తొలి విడతలో రూ.10వేల చొప్పున 7,887 మందికి, రెండో విడతలో 4,875 మందికి రూ.20వేల చొప్పున, మూడో విడతలో 2,070 మంది వ్యాపారులకు రూ.50వేల చొప్పున రుణ సదుపాయం కల్పించారు. నాలుగో విడతలో వికారాబాద్ పురపాలికలో 793



మందికి, తాండూరులో 840, పరిగిలో 250, కొడంగల్‌లో 280 మందికి క్రెడిట్ కార్డులు అందించనున్నారు. గతంలో రుణం తీసుకొని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించినవారే నాలుగో విడతకు అర్హులుగా నిర్ధారించారు.

**పరిమితి రూ.30 వేలు..**

నిరుపేద కుటుంబాల్లోనూ ఆర్థిక అక్షరాస్యతను తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే క్రెడిట్ కార్డులను అందించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే ముమ్మరం చేశారు. వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఒక్కో క్రెడిట్ కార్డుపై రూ.10వేల నుంచి గరిష్ఠంగా రూ.30వేల దాకా పరిమితి ఉంటుందని అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా లక్ష్యం పూర్తి చేస్తాం..: రవికుమార్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మానిర్దేశిత లక్ష్యాన్ని వచ్చే ఏడాది మార్చికల్లా పూర్తి చేయాలని పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నాం. వ్యాపారంతో ఎప్పటికప్పుడు వచ్చిన డబ్బులు చాలా వరకు ఖర్చు చేస్తున్నారు. పొదుపు అలవాట్లతో ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది. ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తున్నాం.

## జీరో దందా.. తలో వంద..!

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు కంకర, ఇసుక నిల్వలను తీసుకెళ్లే వాహన చోదకుల అతివేగానికి అంతే లేకుండా పోయింది. మూడు జిల్లాల్లోని క్వారీలు, రీచ్‌ల్లో భూగర్భ గనులు, రెవెన్యూ అధికారుల అనుమతుల ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సజావుగా సాగుతున్నా.. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అనధికారికంగా నిర్వహించే అక్రమ రవాణా వల్లే రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి.

**రాజకీయ అండ**

నల్గొండ జిల్లాలో రావులబండ(దోమలపల్లి), నార్కట్‌పల్లి, కేతేపల్లి, కట్టంగూరు, దేవరకొండ, కొండమల్లేపల్లి, గాజీనగర్, పోలేపల్లి, దామరచర్ల, తిప్పర్తి, పెద్ద సూరారం, కనగల్, ఇనుపాముల, బొల్లేపల్లి, పోతినేనిపల్లి, ఇండ్లూరు, వేలాల ప్రాంతాల్లో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తుండటతో రహదారులు దెబ్బతింటున్నాయి. రహదారి పనులకు ఉచితంగా 'జీరో' బిల్లు ఇచ్చేలా ఆయా క్రషర్ల యజమానులకు గనులు, ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం, పోచంపల్లి, బీబీనగర్ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రెండు, గరిడేపల్లి మండలంలో ఆరు కంకర మిల్లులున్నాయి. అప్పన్నపేట, హుజూర్‌నగర్–కోదాడ రోడ్ మధ్యలో ఉన్న కంకర మిల్లుల నుంచి వచ్చే పొగతో స్థానికులు, రవాణా వల్ల వెలువడే దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులు



పడుతున్నారు. జీరో దందాను ఆసరాగా చేసుకుని క్రషర్ల నిర్వాహకులు ఒక బిల్లు చీటీతో దొంగ వేబిల్లులు సృష్టించి రెండు, మూడు లారీలను అక్రమంగా తరలిస్తున్నారు. దీనికి అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సమయాన్ని ఎంచుకుంటున్నారు. అన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి 'నాలుగు రాళ్లు' వెనకేసుకునేలా చేస్తుండటంతో వారూ కూడా చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలున్నాయి.

జాతీయ, రాష్ట్ర రహదారులపై ఒకే నంబరు ప్లేట్లతో నాలుగైదు వాహనాలు ఉంటున్నాయి. బిహార్, ఒడిశాకి చెందిన వారిని డ్రైవర్లుగా నియమించడంతో వారు ఇష్టారీతిన నడిపిస్తున్నారు.

టిప్పరు, లారీలో గరిష్ఠంగా 30 టన్నుల కంకర నింపాలి. కానీ యజమానులు 70 టన్నుల వరకు నింపేస్తున్నారు. దీంతో వాహనాలు వంగి ప్రయాణించి.. వేగంపై పట్టు తప్పుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా భూగర్భ గనులశాఖాధికారి జాకబ్ సామ్యూల్‌తో ప్రస్తావించగా.. తనిఖీలు చేపట్టి అక్రమాలకు పాల్పడ్డ క్రషర్ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.




దిల్లీ: ఏపీ సీఎం చంద్రబాబు దిల్లీ పర్యటన కొనసాగుతోంది. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమయ్యారు. పోలవరం సహా రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, వివిధ పథకాలకు నిధుల విడుదలపై కేంద్రమంత్రితో ఆయన చర్చించారు. ప్రత్యేకించి విభజన హామీల్లో భాగంగా ఆమోదం పొందిన ప్రాజెక్టులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, పెండింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు.

రాష్ట్రానికి నీటి భద్రత అత్యంత కీలక అంశమని.. రాష్ట్రంలో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలోఉంచుకుని కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టులపై కేంద్ర-రాష్ట్ర సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జల్ జీవన్ మిషన్ అమలు కోసం రాష్ట్రానికి అదనంగా రూ.1,000 కోట్లు కేటాయించాలని సీఎం కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.524.41 కోట్లు ఖర్చు చేశామని.. దీనికి సంబంధించిన కేంద్ర వాటా నిధులను కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వెంట కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు ఉన్నారు.


# జగన్‌కు యువతపై ఇంత ద్వేషమా?: మంత్రి లోకేశ్




అమరావతి: ఐటీ పెట్టుబడులు, యువత ఉద్యోగాలపై వైకాపా కుట్ర చేస్తోందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్, సత్వా వంటి సంస్థలపై కోర్టులో వైకాపా పిల్ వేసిందన్నారు. తాజాగా రహేజా ఐటీ పార్కు పైనా పిల్ దాఖలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ పెట్టారు. "ఈ ప్రాజెక్టులతో ఏపీ యువతకు లక్షకు పైగా ఉద్యోగాలు అందించే అవకాశముంది. యువత భవిష్యత్తుపై జగన్‌కు ఇంత ద్వేషమెందుకు? రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు, ఉద్యోగాలను అడ్డుకోవాలనే ఆలోచన సబబా?" అని లోకేశ్ నిలదీశారు.

**రాజమండ్రికి లోకేష్.. ఆప్యాయంగా పలకరిస్తూ ఫోటోలు దిగిన మంత్రి :** విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఈరోజు (శుక్రవారం) రాజమండ్రి ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తన వద్దకు వచ్చిన మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ ఫోటోలు దిగారు. అనంతరం విమానాశ్రయం నుంచి బయలుదేరిన లోకేష్‌కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. బూరుగుపూడి, గాడాల గ్రామంలో మంత్రికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. రాజమండ్రి క్వారీ మార్కెట్ జంక్షన్ వద్దకు చేరుకున్న లోకేష్‌కు పార్టీ జెండాలు, డప్పులు, బాణా సంచాలతో పెద్ద ఎత్తున తెలుగు దేశం నేతలు, ప్రజలు స్వాగతం పలికారు. ఆపై లాలాచెరువు జంక్షన్‌లో కూడా మంత్రిని ఘన స్వాగతించారు టీడీపీ శ్రేణులు.

# తిరుమల పరకామణి లెక్కింపుపై హైకోర్టు ఆదేశాలివే..




అమరావతి , డిసెంబర్ 19: తిరుమల పరకామణి విషయంలో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కానుల లెక్కింపు ప్రక్రియను సమూలంగా ప్రక్షాళించాలని ధర్మాసనం ఆదేశించింది. పరకామణిలో చోరీకి సంబంధించి ఈరోజు (శుక్రవారం) హైకోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా టీటీడీకి హైకోర్టు ముఖ్య సూచనలు చేసింది. దొంగతనాలను అరికట్టేందుకు రెండు దశలలో సంస్కరణలు చేపట్టాలని సూచించింది. కానుకల లెక్కింపులో మానవ ప్రమేయాన్ని తగ్గించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అత్యాధునిక యంత్రాలను వినియోగించాలని టీటీడీకి స్పష్టీకరించింది. ఇందుకోసం తక్షణ, శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని టీటీడీకి ఆదేశించింది. హుండీ సీలింగ్, రవాణా, లెక్కింపు విషయంలో తక్షణం చేపట్టాల్సిన భద్రతా చర్యలపై రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో పాటు ఇరువురు న్యాయవాదులకు సూచించింది. శాశ్వత సంస్కరణలో భాగంగా కానుకలను వర్గీకరించడం, విదేశీ కరెన్సీని గుర్తించేందుకు ఏఐను ఉపయోగించడం, విలువైన లోహాలను వేరు చేసే అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. దీనిపై ఎనిమిది వారాల్లోపు ముసాయిదా రూపొందించి కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. నిందితుడు రవికుమార్, అతని కుటుంబ సభ్యుల ఆస్తుల అమ్మకాలు, రిజిస్ట్రేషన్ల వివరాలను సీల్డ్ కవర్లో వారంలోపు తమ ముందు ఉంచాలని ఏసీబీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 26కు హైకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది.




# శ్రీశైలంలో రీల్స్‌పై యువతి క్షమాపణలు

నంద్యాల, డిసెంబర్ 19: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థాన పరిధిలో భక్తుల మనోభావాలకు భంగం కలిగించేలా రీల్స్ చేసిన యువతిపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీశైలంలో నిబంధనలకు విరుద్ధంగా రీల్స్ చేసిన వీడియో వైరల్‌పై యువతి స్పందించింది. తాను దేవాలయంలో డ్యాన్స్ చేయలేదని, ఒకవేళ తప్పు చేసి ఉంటే క్షమించాలని సెల్ఫీ వీడియోలో చెప్పుకొచ్చింది. మీడియాలో, ఇన్ స్టాలో, యూట్యూబ్‌లలో ఓ వీడియో ట్రోల్ అవుతున్నదని.. అది తనదే అని చెప్పింది. మూడు రోజుల క్రితం శ్రీశైలం వెళ్లినట్లు తెలిపింది. శ్రీశైలంలో లొకేషన్ బాగుందని ఒక పోప్ సాంగ్ వీడియో తీసుకున్నానని చెప్పింది. పోప్ సాంగ్‌లో శారీ కట్టుకుని సాంప్రదాయంగానే వీడియోలో డ్యాన్స్ చేశానని.. చిన్నచిన్న బట్టలు వేసుకుని బ్యాడ్‌గా బిహేవ్ చేయలేదని వివరించింది. టెంపుల్ బయట వీడియో చేశానని.. ఒకవేళ తప్పుగా చేసి ఉంటే తనను క్షమించండి అని అంటూ యువతి వీడియో రిలిజ్ చేసింది.

మరోవైపు శ్రీశైలం దేవస్థానం అధికారులు కూడా ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. శ్రీశైలం పరిసరాలలో క్షేత్ర పరిధిలోని ప్రధాన వీధులలో భక్తులు, స్థానికులు ఎవరూ కూడా వీడియోలు తీయకూడదని, రీల్స్ చేయకుడదని దేవస్థానం ప్రకటించింది. దేవస్థానం అనుమతి లేకుండా క్షేత్ర పరిధిలో శ్రీశైలంలో ఎక్కడైనా వీడియోలు, ఫోటోలు తీస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని శ్రీశైలం దేవస్థానం అధికారులు వెల్లడించారు.

# జగన్ బంధువు అర్జున్‌రెడ్డి అరెస్ట్

గుడివాడ: వైకాపా అధ్యక్షుడు జగన్ బంధువు సిరిగిరెడ్డి అర్జున్‌రెడ్డిని కృష్ణా జిల్లా గుడివాడ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేశ్, వారి కుటుంబసభ్యుల ఫొటోలను అసభ్యంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారనే కేసులో ఆయన ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఇటీవల పోలీసులు అర్జున్‌రెడ్డికి నోటీసులు ఇచ్చారు. దీంతో నేడు ఆయన గుడివాడ టూటౌన్ పీఎస్‌కు రాగా అరెస్ట్ చేశారు. గతంలో అర్జున్‌రెడ్డిని అరెస్ట్ చేసేందుకు యత్నించగా విదేశాలకు పరారయ్యారు. దీంతో పోలీసులు ఆయనపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 8వ తేదీన విదేశాల నుంచి తిరిగి రావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుడివాడ పోలీసులు అర్జున్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని 41 ఏ నోటీసులు ఇచ్చారు. ఉమ్మడి కడపతో పాటు మరికొన్ని జిల్లాల్లోనూ అతడిపై కేసులు నమోదయ్యాయి. అర్జున్‌రెడ్డి.. జగన్‌కు బాబాయ్ వరసయ్యే వైఎస్ ప్రకాశ్‌రెడ్డి మనవడు.

**కొడాలి నాని అనుచరుడు అరెస్ట్...** మరోవైపు వైకాపా నేత, మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుడు కూనసాని వినోద్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతుండగా అతడిని గుడివాడ వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వినోద్ నుంచి రూ.50వేల నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వైకాపా అధికారంలో ఉండగా అడ్డూ అదుపు లేకుండా జూద శిబిరాలు నిర్వహించినట్లు అతడిపై ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఆ శిబిరాలు నిర్వహిస్తుండటంతో పోలీసులు వినోద్‌పై కేసు నమోదు చేశారు.




# బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు.. భారతీయులకు అడ్వైజరీ

బంగ్లాదేశ్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ మరణంతో ఆందోళనకారులు మళ్లీ వీధుల్లోకి వచ్చారు. గురువారం రాత్రి నుంచి భారత్, అవామీలీగ్ పార్టీకి వ్యతిరేకంగా తీవ్ర నిరసనలు చేపట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషన్ అడ్వైజరీ జారీ చేసింది. భారతీయులంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. "ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా.. ఈ దేశంలో నివసిస్తున్న భారతీయులు, భారత విద్యార్థులు అనవసర ప్రయాణాలు చేయొద్దు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు. ఏదైనా ఎమర్జెన్సీ అయితే సాయం కోసం హైకమిషన్, అసిస్టెంట్ హైకమిషన్ కార్యాలయాలను సంప్రదించండి" అని భారత దౌత్యాధికారులు తమ అడ్వైజరీలో వెల్లడించారు.

**పరిస్థితి సంక్లిష్టంగా మారుతోంది..** మరోవైపు బంగ్లాదేశ్ పరిణామాలపై భారత విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ స్పందించింది. పరిస్థితి చాలా సంక్లిష్టంగా మారుతోందని, బంగ్లాలో మైనార్టీలపై దాడుల గురించి తెలిసి విదేశాంగ శాఖ ఆందోళనతో ఉందని పేర్కొంది. ఆ దేశంలో వచ్చే ఏడాది జరగాల్సిన ఎన్నికలపైనా అనిశ్చితి నెలకొందని తెలిపింది. తాత్కాలిక ప్రభుత్వంతో భారత విదేశాంగ శాఖ నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉందని పేర్కొంది.

**అవామీలీగ్ ఆఫీసు ధ్వంసం...** ఇదిలా ఉండగా.. బంగ్లాలో ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీకి న్యాయం చేయాలంటూ ఢాకా యూనివర్సిటీ విద్యార్థులు ర్యాలీలు చేపట్టారు. నిన్న రాత్రి రాజ్‌షాహీలోని అవామీలీగ్ పార్టీ కార్యాలయాన్ని నిరసనకారులు ధ్వంసం చేశారు. చిట్టగాంగ్ మాజీ మేయర్ మొహియుద్దీన్ నివాసానికి నిప్పు పెట్టారు. ఢాకాలోని చారిత్రక సాంస్కృతిక సంస్థ ఛాయానట్ ప్రాంగణాన్ని ధ్వంసం చేసి నిప్పంటించారు. పలు మీడియా కార్యాలయాలకు నిప్పు పెట్టగా.. అక్కడి విలేకరులను ఆర్మీ, రెస్క్యూ సిబ్బంది రక్షించారు.

# కొడాలి నానికి ఊహించని షాక్.. ప్రధాన అనుచరుడు అరెస్ట్..




గుడివాడ, డిసెంబరు19 : మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత కొడాలి నానికి ఊహించని షాక్ తగిలింది. ప్రధాన అనుచరుడు, రాజకీయ సలహాదారుడు కూనసాని వినోద్‌ను గుడివాడ వన్ టౌన్ పోలీసులు ఇవాళ(శుక్రవారం) అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతుండగా వినోద్‌ను పట్టుకున్నారు. వినోద్ దగ్గరి నుంచి రూ.50వేలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. వైసీపీ ప్రభుత్వంలో అడ్డూ ఆదుపు లేకుండా పేకాట శిబిరాలను వినోద్ నిర్వహించారని పోలీసులు గుర్తించారు. కూటమి ప్రభుత్వంలోనూ ఆయన పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారని సమాచారం అందింది. సమాచారం అందడంతో వెంటనే గుడివాడ వన్ టౌన్ పోలీసులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో వినోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

# తెలంగాణకు ఇచ్చినట్టే మాకు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం: మంత్రి నిమ్మల




న్యూఢిల్లీ, డిసెంబర్ 19: ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం చంద్రబాబు కీలక భేటీ జరిగిందని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంచి చర్చ జరిగిందన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుకు కేంద్ర సహకారానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారన్నారు. 2011లో జారీ చేసిన పోలవరం స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా రద్దు చేయాలని విజ్ఞప్తి చేశామని. స్టాప్ వర్క్ ఆర్డర్ ప్రస్తుతం 2026 నవంబర్ వరకు పొడిగించారని చెప్పారు. పోలవరం రైట్, లెఫ్ట్ మెయిన్ కెనాల్స్ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంపు, అదనపు వ్యయాన్ని పోలవరం ప్రాజెక్టు ఖర్చులో చేర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు మంత్రి తెలిపారు. గోదావరి జలాల పంపకాలపై వెంటనే ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశామన్నారు. అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాన్ని అమలు చేయాలని కేంద్రాన్ని సీఎం కోరారన్నారు. వంశధార ట్రిబ్యునల్ 2021 తీర్పును వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. వంశధార తీర్పుతో నేరేడు బ్యారేజ్ నిర్మాణానికి అవకాశం ఉంటుందన్నారు. పోలవరం %-% నల్లమల సాగర్‌కు తక్షణ సాంకేతిక, ఆర్థిక అనుమతులు ఇవ్వాలని కోరామని తెలిపారు. గోదావరిలో వృధాగా సముద్రంలో కలిసిపోతున్న వరద జలాల వినియోగమే లక్ష్యమని స్పష్టం చేశారు. గత 50 ఏళ్లలో 1.53 లక్షల టీఎంసీల నీరు సముద్రంలో కలిసినట్టు వెల్లడించారు. గత 5 ఏళ్లలోనే 20,300 టీఎంసీల నీరు వృథా అయ్యిందని.. ఏటా సగటున 4,000 టీఎంసీల నీరు బంగాళాఖాతంలో కలుస్తోందని చెప్పారు.

దిగువ రాష్ట్రంగా వరద నీటిని వినియోగించుకునే హక్కు ఏపీకి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలో చేపట్టిన కాళేశ్వరం , సీతారామ ప్రాజెక్టుకు ఎలా అనుమతులు ఇచ్చారో తమకు అలాగే అనుమతులు ఇవ్వాలని కోరామన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులే ఏపీకి కూడా వర్తించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. తెలంగాణలో ఉన్న రాజకీయ విభేదాల కారణంగానే తెలంగాణ ప్రభుత్వం కేసులు వేస్తుంది తప్ప వేరే అంశం అంటూ ఏమీ లేదన్నారు. సుప్రీంకోర్టులో తాము కూడా కెవిఎట్ పిటిషన్ దాఖలు చేశామన్నారు. వృథా నీటిని వినియోగించడం జాతీయ ప్రయోజనమని వ్యాఖ్యానించారు. తెలుగు రాష్ట్రాలు రెండూ బాగుండాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.




విజయవాడ, డిసెంబరు19 : ప్రసాదంపాడు వద్ద నలుగురు మావోయిస్టులు పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. వీరిని విజయవాడలో విచారించడానికి అనుమతి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎంఎస్జే కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మావోయిస్టులను విచారించడం ద్వారా కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ విచారణలో కొంతమంది కీలక వ్యక్తుల గురించి, వారి సంఘటిత కార్యకలాపాల గురించి మరింత సమాచారం సేకరించే ఛాన్స్ ఉంది.
ఈ పిటీషన్‌పై వాదోపవాదాలు జరిపిన తర్వాత, న్యాయస్థానం మావోయిస్టులను పోలీసుల కస్టడీకి ఇవ్వాలని ఆదేశించింది. అందువల్ల, ఈ వారాంతంలో (శుక్రవారం నుంచి ఆదివారం వరకు) వీరిని నెల్లూరు జైల్లో విచారించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# మద్యం తాగేందుకు రూ.10 ఇవ్వలేదని వ్యక్తిని చంపిన బాలుడు



విజయవాడ: నగరంలోని కొత్తపేటలో దారుణం చోటుచేసుకుంది. మద్యం తాగేందుకు రూ.10 ఇవ్వలేదని తాతాజీ (48) అనే వ్యక్తిపై ఓ బాలుడు (17) కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన తాతాజీ ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు.

గురువారం రాత్రి కొత్తపేటలోని ఓ బార్ వద్ద ఈ హత్య జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

## లెహంగాలో కట్టిపడేస్తున్న అనన్య పాండే.. ప్రత్యేకత ఏమిటంటే?

కొన్నిసార్లు మనకు మనం వేసుకునే బట్టలు విపరీతమైన అందాన్ని తీసుకొస్తాయి. ఈ విషయాన్ని అందరూ ఒప్పుకోకపోవచ్చు. కానీ అదే వాస్తవం. పవన్ కళ్యాణ్ ఎన్ని సినిమాలు చేసినా ఖుషి సినిమాలోనే ఎక్కువ అందంగా ఎందుకు కనిపిస్తారు అంటే పవన్ కళ్యాణ్ వేసుకున్న కాస్ట్యూమ్స్. ఆ సినిమాకి కాస్ట్యూమ్ డిజైనర్ గా పని చేశారు రేణు దేశాయ్. అయితే ఆ సినిమాలో పవన్ కళ్యాణ్ ని చూస్తుంటే తమ భర్తను ఎలా చూపించాలో తన భార్యకు బాగా తెలుసు అని ఫీలింగ్ కలిగింది. అలానే సమంత ఎన్ని సినిమాలు చేసినా కూడా ఏం మాయ చేసావే సినిమాలో తన కాస్ట్యూమ్స్ అదిరిపోతాయి. సింపుల్గా అందంగా కనిపించేటట్లు ఆ సినిమా కాస్ట్యూమ్స్ ఉంటాయి. చాలా సందర్భాల్లో కాస్ట్యూమ్స్ మాత్రమే మంచి బ్యూటీ ను తీసుకొస్తాయి. కొన్ని పీరియాడిక్ సినిమాల్లో కూడా కాస్ట్యూమ్స్ అనేవి కీలకపాత్రను పోషిస్తాయి. అయితే చాలామంది సెలబ్రిటీలు కేవలం సినిమాల్లో మాత్రమే కాకుండా బయట కనిపించేటప్పుడు అద్భుతమైన కాస్ట్యూమ్స్ వేసుకుంటారు. తాజాగా సోషల్ మీడియాలో అనన్య పాండే ఫోటోలు వైరల్ గా మారాయి. అనన్య పాండే వేసుకున్న లెహంగాతో



ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకట్టుకుంది. ప్రస్తుతం కుర్రకారు సైతం కామెంట్స్ తో పొగడడం మొదలుపెట్టారు. అయితే ఈ లెహంగాను భూమికా శర్మ డిజైన్ చేశారు. ఇది దాదాపు 1.1 లక్షలని తెలుస్తుంది. అయితే కాస్ట్ కూడా ఆ లుక్ లో కనిపిస్తుంది. ఆ లెహంగాను అనన్య పాండే ధరించిన తర్వాత ఆ రిచ్ ఫీలింగ్ కచ్చితంగా కలుగుతుంది. అందులో భాగంగానే ఇప్పుడు అద్భుతమైన లెహంగా ధరించి అందరిని ఆకట్టుకుంది. గ్రీన్ గోల్డెన్ కలర్ కాంబినేషన్లో ఉన్న ఈ లెహంగాపై వైట్ కలర్ ఎంబ్రాయిడరీ తో చాలా చక్కగా డిజైన్ చేశారు. ఒక ఈవెంట్ లో భాగంగా గ్లామర్ తో ఆకట్టుకున్న ఈమె మరొకవైపు ఇలా ట్రెండీ ఔట్ఫిట్ లో కనిపించి అభిమానులను అలరించింది. తాజాగా అనన్య పాండే ఫోటోలు వైరల్ గా మారుతున్నాయి. అనన్య పాండే విషయానికి వస్తే.. హిందీలో చాలా సినిమాలు చేసింది.

పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటించిన లైగర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా పరిచయం అయింది. బాక్స్ ఆఫీస్ వద్ద లైగర్ సినిమా ఊహించని ఫలితాన్ని అందుకోలేక పోయింది. అందుకని తెలుగులో మళ్లీ అనన్యకు అవకాశాలు రాలేదు. లైగర్ సినిమా సక్సెస్ అయి ఉంటే మన తెలుగు దర్శకులు అనన్య వెంటపడేవాళ్లు. తెలుగులో పెద్దగా సినిమాలు చేయకపోయినా కూడా చాలామంది తెలుగు యువత ఆమెను సోషల్ మీడియా వేదికలో ఫాలో అవుతూ ఉంటారు. తన ఇన్స్టాగ్రామ్ పోస్టులతో కూడా చాలామంది అభిమానులకు దగ్గరగా ఉంటుంది అనన్య.

## మన శంకరవరప్రసాద్ గారు మెయిన్ హైలైట్ అదే!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా టాలీవుడ్ హిట్ మిషన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా మన శంకరవరప్రసాద్ గారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి నుంచి వస్తున్న సినిమా కావడంతో పాటూ చిరంజీవితో అనిల్ చేస్తున్న మొదటి మూవీ కావడంతో ఈ మూవీపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి.

**మొదటిసారి స్క్రీన్ షేర్ చేసుకోనున్న చిరూ, అనిల్...** ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా అనిల్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అందులో భాగంగానే చిరంజీవి సరసన ఏకంగా లేడీ సూపర్ స్టార్



నయనతారను హీరోయిన్ గా ఎంపిక చేసిన అనిల్, ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ తో క్యామియో రోల్ చేయిస్తున్నారు. చిరూ, వెంకీ కలిసి మొదటిసారి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని తెలిసనప్పటి నుంచి ఈ మూవీపై ఆడియన్స్ కు ఎగ్జైట్‌మెంట్ బాగా పెరిగింది.

**శంషాబాద్ లో జరుగుతున్న షూటింగ్...** శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న మన శంకరవరప్రసాద్ గారు 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే పలు షెడ్యూళ్ల షూటింగ్ పూర్తి కాగా, రీసెంట్ గానే తాజా షెడ్యూల్ లో విక్టరీ వెంకటేష్ కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శంషాబాద్ లోని రాజ్ ప్యాలెస్ లో జరుగుతుండగా, శనివారం రోజు చిరంజీవి, వెంకటేష్ తో కాంబినేషన్ సీన్ ను షూట్ చేశారని, మన శంకరవరప్రసాద్ గారులో ఈ ఎపిసోడ్ మెయిన్ హైలైట్ గా నిలవనుందని యూనిట్ సభ్యులు చెప్తున్నారు.

**మీసాల పిల్ల సాంగ్ కు అద్భుతమైన రెస్పాన్స్...** ఇదిలా ఉంటే ఈ సినిమా నుంచి రీసెంట్ గా మీసాల పిల్ల అనే ఫస్ట్ లిరికల్ రిలీజవగా, ఆ సాంగ్ కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మీసాల పిల్ల సాంగ్ ఆల్రెడీ 50 మిలియన్ల వ్యూస్ ను దాటి దేశవ్యాప్తంగా రికార్డు సృష్టించింది.

భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సాంగ్ లో చిరంజీవి తన సిగ్నేచర్ మూమెంట్స్ తో పాటూ మంచి ఎక్స్‌ప్రెషన్స్, ఎనర్జిటిక్ డ్యాన్సులతో ఆడియన్స్ ను అలరించారు.




## శృతిహాసన్ మొదలు ఇమాన్వీ వరకూ.. ప్రభాస్ ఇంటి భోజనాన్ని రుచి చూసిన హీరోయిన్స్ వీళ్ళే!



ఇండస్ట్రీలో ప్రభాస్ క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. బాహుబలి సినిమా తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రభాస్ కు మంచి గుర్తింపు లభించింది. ఇప్పుడు ప్రభాస్ నుంచి ఒక సినిమా వస్తుంది అంటే ప్రపంచవ్యాప్తంగా ఆడియన్స్ ఎదురు చూస్తుంటారు అని చెప్పటంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు ప్రభాస్. ప్రస్తుతం చేస్తున్న ప్రతి ప్రాజెక్టు కూడా పాన్ ఇండియా రేంజ్ లోనే విడుదలవుతుంది. ప్రభాస్ టాలెంట్ గురించి.. ఆల్రెడీ సినిమాలు ప్రూవ్ చేసే దాని గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం ఏమీ లేదు. అలానే ప్రభాస్ సినిమాలు, ప్రభాస్ క్యారెక్టర్ ఎంత పాపులర్ అయిందో ప్రభాస్ ఫుడ్ కూడా అంతే పాపులర్ అయింది. చాలామంది సెలబ్రిటీలు ప్రభాస్ ఇంట్లో ఫుడ్ గురించి మాట్లాడుతూ ఉంటారు. ఎవరు చూడని వెరైటీ ఫుడ్స్ ను అందరికీ రుచి చూపిస్తుంటాడు ప్రభాస్. ప్రభాస్ తో పని చేయటం అనేది ఒక అదృష్టం అని ఇప్పటికే చాలామంది దర్శకులు కూడా చెబుతూ ఉంటారు.

**శృతిహాసన్ నుంచి ఇమాన్వి వరకు...** ప్రభాస్ అందరికీ అద్భుతమైన ఫుడ్ పెడతాడు అని ఇప్పటివరకు అతనితో పని చేసిన చాలా మంది తెలిపారు. గతంలో సలార్ సినిమాకి పని చేసినప్పుడు కూడా శృతిహాసన్ తన ఫుడ్ గురించి చాలా మాటలు చెప్పారు. రాజా సాబ్ సినిమా చేస్తున్నప్పుడు నిధి అగర్వాల్, అలానే మాళవిక మోహనన్ కూడా ప్రభాస్ ఫుడ్ వీడియోలను అప్పట్లో సోషల్ మీడియాలో కూడా పోస్ట్ చేశారు. పృధ్వీరాజ్ సుకుమారన్ కూడా చాలా సందర్భాల్లో ఈ విషయాన్ని చెప్పాడు. దేవుడు ఏదైనా వరం అందిస్తే ప్రభాస్ చెఫ్ ను కిడ్నాప్ చేయాలి అనే కోరికను చెప్పే వాళ్ళు కూడా ఉన్నారు. ప్రస్తుతం ప్రభాస్ హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా మీద విపరీతమైన అంచనాలు ఉన్నాయి. సీతారామం వంటి సక్సెస్ఫుల్ సినిమా తర్వాత హను ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఇమాన్వి హీరోయిన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే. అలవాటు ప్రకారం తాజాగా ఇమాన్వికి కూడా ప్రభాస్ ఫుడ్ పంపించారు. ఈ విషయాన్ని స్వయంగా ఇమాన్వి ఇన్స్టాగ్రామ్ స్టోరీలో యాడ్ చేశారు. ఇమాన్వి కోసం చాలా వెరైటీ వంటలను తయారు చేయించారు ప్రభాస్.

హార్ట్ మరియు కడుపు నిండిపోయింది థాంక్యూ ప్రభాస్ గారు అంటూ ఇమాన్వి వీడియో షేర్ చేస్తూ రాసుకొచ్చారు. ప్రభాస్ ఫుడ్ గురించి చాలామంది సెలబ్రిటీలు ఇలా వీడియోలు పెడుతూ ఉంటే ఇప్పటివరకు ప్రభాస్ తో పని చేయని చాలా మందికి కనీసం ఫుడ్ కోసమైనా ప్రభాస్ తో పని చేయాలి అనే కోరిక కలిగించేలా ఉన్నాయి. ఇది వినడానికి హాస్యాస్పదంగా అనిపించినా కూడా అక్కడక్కడా ఇటువంటి కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి.

## ఆ విషయంలో వెనుకంజలో ఉన్న రాజా సాబ్



సంక్రాంతి పండగ అంటే ఎన్నో సెలవులుంటాయి. ఆ సీజన్ లో సినిమాలు రిలీజ్ చేస్తే మామలూ రోజుల్లో ఒకటి లేదా రెండు టికెట్లు తెగితే సంక్రాంతి సీజన్ లో మాత్రం ఫ్యామిలీ మొత్తం టికెట్లు తెగుతాయి.

అందుకే ఎంతోమంది దర్శకనిర్మాతలు, హీరోలు తమ సినిమాలను సంక్రాంతికి రిలీజ్ చేయాలని టార్గెట్ గా పెట్టుకుంటూ ఉంటారు. దాని కోసం పోటీకి కూడా రెడీ అవుతారు.

**2026 సంక్రాంతికి భారీ పోటీ...** ఎప్పటిలానే ఈ సంక్రాంతికి కూడా పోటీ భారీగా నెలకొంది. ఈసారి సంక్రాంతి రేసులో ది రాజా సాబ్, మన శంకరవరప్రసాద్ గారు, జన నాయగన్ లాంటి భారీ సినిమాలు రిలీజ్ కానున్నాయి. వాస్తవానికి రాజా సాబ్ డిసెంబర్ లో రావాల్సింది కానీ సంక్రాంతికి రిలీజ్ చేస్తే తమ సినిమా ఇంకా బాగా పెర్ఫార్మ్ చేయడంతో పాటూ మంచి కలెక్షన్లను రాబట్టుకోవచ్చని రిలీజ్ ను సంక్రాంతికి మార్చుకున్నారు మేకర్స్.

**చిరూ మూవీ నుంచి మీసాల పిల్ల భారీ హిట్...** ఇక చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మన శంకరవరప్రసాద్ గారు అందరి కంటే ముందుగా తమ సినిమాను 2026 సంక్రాంతికి రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేశారు. చెప్పినట్టుగానే అనిల్ తన సినిమాను సంక్రాంతికి దింపడానికి రెడీ చేస్తున్నారు. ఆల్రెడీ మూవీ నుంచి మీసాల పిల్ల అనే ఫస్ట్ సింగిల్ ను కూడా రిలీజ్ చేసి దాన్ని భారీ హిట్ ను చేశారు.

**ఇంకా మొదలవని రాజా సాబ్ ప్రమోషన్స్...** దళపతి విజయ్ హీరోగా వస్తోన్న ఆఖరి సినిమా జననాయగన్ కూడా సంక్రాంతికి రిలీజ్ కానుండగా, ఇప్పటికే మేకర్స్ ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేశారు. కానీ ప్రభాస్– మారుతి కాంబినేషన్ లో వస్తోన్న రాజా సాబ్ నుంచి మాత్రం మేకర్స్ ఇంకా ఎలాంటి సాంగ్ ను రిలీజ్ చేయలేదు. రిలీజ్ చేద్దామని రెండు మూడు సార్లు ప్లాన్ చేసినప్పటికీ అది కుదరలేదు. ఓవైపు పోటీలో ఉన్న సినిమాలు ఇప్పటికే తమ సినిమాల్లోని ఫస్ట్ సాంగ్ ను రిలీజ్ చేసుకుని ప్రమోషన్స్ ను మొదలుపెడితే రాజా సాబ్ మాత్రం ఇంకా సాంగ్ రిలీజ్ చేయకుండా, ప్రమోషన్స్ ను స్టార్ట్ చేయకుండా ఉన్నారు. ఈ విషయంపై ఫ్యాన్స్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆల్రెడీ రాజా సాబ్ నుంచి ట్రైలరే వచ్చిందని, సాంగ్స్ కూడా ఆల్రెడీ రెడీగా ఉన్నాయని, వాటన్నింటినీ ఓ ప్లాన్ ప్రకారం రిలీజ్ చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని కొందరంటుంటే, మరికొందరు మాత్రం రిలీజ్ దగ్గర పడుతున్నప్పటికీ ఇంకా ఫస్ట్ సాంగ్ కూడా రిలీజ్ చేయకపోవడమేంటని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఎలా చూసుకున్నా ఇప్పటికైతే సంక్రాంతి రేసులో ఉన్న సినిమాలతో పోలిస్తే రాజా సాబ్ స్పీడు పెంచాల్సిన అవసరం ఉందనిపిస్తుంది.

## మృణాల్ చేతిలో అదొక్కటే.. రీజన్స్ ఏంటి..?

బాలీవుడ్ లో సీరియల్స్ చేసి ఆ క్రేజ్ తో సిల్వర్ స్క్రీన్ ఛాన్స్ లు అందుకున్న మృణాల్ ఠాకూర్ తెలుగులో సీతారామం సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. హను రాఘవపూడి డైరెక్షన్ లో తెరకెక్కిన సీతారామం సినిమా సూపర్ హిట్ అవ్వడంతో మృణాల్ ఠాకూర్ కి తెలుగులో మంచి పాపులారిటీ వచ్చింది. ఆ నెక్ట్స్ నానితో హాయ్ నాన్న చేసి మెప్పించింది మృణాల్ ఐతే థర్డ్ ప్రయత్నంగా విజయ్ దేవరకొండతో ఫ్యామిలీ స్టార్ సినిమా చేసింది కానీ అది వర్క్ అవుట్ అవ్వలేదు. 3 సినిమాలు తీస్తే రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగా అయినా కూడా మృణాల్ కి తెలుగులో సరైన అవకాశాలు రావట్లేదు.

**మృణాల్ ఠాకూర్ చేతిలో ఒకే ఒక్క సినిమా..** నిజంగానే మృణాల్ కి ఛాన్స్ లు రావట్లేదా ఒకవేళ వచ్చినా ఆమె కాదంటుందా అన్నది తెలియదు కానీ మృణాల్ ఠాకూర్ చేతిలో ఒకే ఒక్క తెలుగు సినిమా ఉంది. అది కూడా ముందు ఒక హీరోయిన్ తో ఆ ప్రాజెక్ట్ అనుకుని టీజర్ కూడా చేశాక మధ్యలో ఆ హీరోయిన్ హ్యాండ్సప్ చెప్పడంతో



మృణాల్ కి ఛాన్స్ దక్కింది. ఒకవేళ ఆ హీరోయిన్ కొనసాగి ఉంటే ఆ అవకాశం కూడా ఉండేది కాదు. మృణాల్ ఠాకూర్ డెకాయిట్ సినిమా నెక్ట్స్ ఇయర్ మార్చిలో రిలీజ్ అవుతుంది. ఈ సినిమాతో పాటు అల్లు అర్జున్ అట్లీ కాంబో సినిమాలో ఒక రోల్ చేస్తుందని వార్తలు వస్తున్నాయి కానీ అది అఫీషియల్ అనౌన్స్ మెంట్ రాలేదు. ఐతే తెలుగులో పరిస్థితి ఇలా ఉండగా ఇంకా బాలీవుడ్ లో మృణాల్ తన ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అక్కడ స్టార్ అవ్వాలన్న తన కల కోసం మృణాల్ ఎలాంటి ఆఫర్ వచ్చినా కాదనకుండా చేస్తుంది.


**టాలీవుడ్ మీదే మృణాల్ ఫోకస్..** హిందీలో సినిమాలు చేస్తున్నా కూడా తన ఫోకస్ అంతా టాలీవుడ్ మీదే మృణాల్ పెట్టింది. అందుకే ఇక్కడ ఏ సినిమా ఛాన్స్ వచ్చినా కాదనకుండా చేయాలని చూస్తుంది. తెలుగులో చేసిన 3 సినిమాల్లో రెండు సక్సెస్ అయినా కూడా మృణాల్ ఠాకూర్ ని ఎవరు పట్టించుకోవట్లేదు. ఐతే ఆడియన్స్ మాత్రం మృణాల్ కి మళ్లీ మళ్లీ అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం అడివి శేష్ డెకాయిట్ ఒక్కటే ఆమె చేస్తుండగా ఆ సినిమా రిలీజ్ తర్వాత ఏమైనా మృణాల్ కి అవకాశాలు వస్తాయేమో చూడాలి. మృణాల్ మాత్రం తన హోప్స్ ని వదులుకోకుండా మంచి అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉంది. తెలుగు, హిందీతో పాటు తమిళంలో కూడా తన ఎంట్రీ ఇవ్వాలని చూస్తుంది మృణాల్. కాకపోతే అమ్మడికి అక్కడ నుంచి ఛాన్స్ లు రావట్లేదు. తెలుగులో మాత్రం మృణాల్ ఎలాంటి సినిమా అయినా చేసి తీరుతా అని కాన్ఫిడెంట్ గా చెబుతుంది.

## హిట్ తో సెకెండ్ ఇన్నింగ్స్ సాధ్యమేనా?

స్టార్ హీరోలతో ఛాన్సులందుకుని మరీ హీరోయిన్ గా నిలదొక్కుకోలేకపోయిన మరో నటి అను ఇమ్మాన్యుయేల్. దేశాలు దాటి అమ్మడు స్టార్ హీరోయిన్ అవ్వాలని టాలీవుడ్ కి వచ్చింది. అమ్మడు అందం, అభినయంతో మంచి అవకాశాలే అందుకుంది. టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ ఇలా మూడు భాషల్ని టచ్ చేసింది.

కానీ ఎక్కడా నిలదొ క్కుకోలేదు. అప్పటి కప్పుడు అవకాశం వచ్చిందా? నటించానా? లేదా? అన్నట్లే కెరీర్ సాగించింది. ఇప్పుడు అవకాశాలు లేక ఖాళీగా ఉంటుంది. అమ్మడు హీరోయిన్ గా సినిమా చేసి మూడేళ్లు అవుతుంది.

**విజయంతో ప్రత్యేకమైన గుర్తింపు:** చివరిగా తమిళ్ లోజపాన్ లో నటించిగా, తెలుగులో ఊర్వశివో రాక్షసివోలో నటించింది. ఆ తర్వాత మళ్లీ తెలుగు సినిమా చేయలేదు. ఆమె స్థానాన్ని కొత్త నటీమణులు ఆక్రమించడంతో? అవకాశాలకు పూర్తిగా దూరమైంది. ఇటీవలే రిలీజ్ అయిన దిగర్ల్ ఫ్రెండ్ లో మాత్రం దుర్గ అనే పాత్రలో నటించింది. సినిమాలో పోషించింది చిన్న పాత్రే అయినా? సినిమా విజయం సాధించడంతో సక్సెస్ లో భాగంగా మారింది.



అమ్మడికిది సెకెండ్ ఇన్నింగ్స్ అనే చెప్పాలి. ఒకసారి గెస్ట్ రోల్స్, కామియో పాత్రలు మొదలు పెట్టిన తర్వాత తిరిగి హీరోయిన్ అవకాశాలు అందుకోవడం అన్నది దాదాపు అసాధ్యం.

**సక్సెస్ ఇచ్చిన కిక్ లో:** ఏ పరిశ్రమలోనూ హీరోయిన్ అవకాశాలు కష్టం. ఈ నేపథ్యంలో సొగసరి సెకెండ్ ఇన్నింగ్స్ ను జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవడమే ముఖ్యం. గర్ల్ ఫ్రెండ్ లో పోషించిన పాత్ర పెద్ద విజయం సాధించడంతో అమ్మడు ఎంతో షంతోషంగా ఉంది. తన మాటల్లోనే సక్సెస్ ఇచ్చిన కిక్ ఎలా ఉంటుంది? అన్నది అర్థమైంది.

ది గర్ల్‌ఫ్రెండ్ నాకు ఎప్పుడూ ప్రత్యేకమే. దుర్గ పాత్ర నిడివి తక్కువే అయినా? అది నాకు అరుదుగా లభించే పరిపూర్ణమైన సంతృప్తిని ఇచ్చింది. ఆ పాత్రలో నిశ్శబ్దమైన బలం ఉంది. మాటల కన్నా మౌనంతోనే ఎక్కువగా మాట్లాడే తత్వం అది.


**ఆ పాత్రతో ప్రత్యేకమైన గుర్తింపు:** ఆ పాత్రకు జీవం పోసే క్రమంలో, నాలో నేను కూడా ఒక కొత్త కోణాన్ని కనుగొన్నాను అంటూ ఇన్స్టాలో రాసు కొచ్చింది. అలాగే చిన్నపాటి సెటైర్ కూడా అందులోనే విసిరింది. మహిళల పాత్రలను నిజాయతీగా, లోతుగా రాసి నందుకు టీమ్ కు ధన్యవాదాలు తెలిపింది. పాత్రలో నటించేటప్పుడు అక్షరాలా తన చేయి పట్టుకుని నడి పించారంది. ప్రతి సంభాషణా ఎంతో అద్భుతంగా అనిపించిందంది. గతంలో తాను పోషించిన హీరోయిన్ల పాత్రల కంటే చిన్న పాత్ర అయినా ఈ సినిమా ద్వారా వచ్చిన గుర్తింపును చెప్పకనే చెప్పింది. మరి అమ్మడి సెకెండ్ ఇన్నింగ్స్ ఈ పాత్ర ఎంత వరకూ సహకరిస్తుందో చూడాలి.




హైదరాబాద్: జయశ్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ కేసులో ఎండీ శ్రీనివాస్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది.

గత కొన్నాళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న ఆయన్ను చెన్నైలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నేడు కోర్టులో హాజరుపరచనున్నారు. ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో కాకర్ల శ్రీనివాస్ పలువురి నుంచి రూ.60 కోట్లకు పైగా వసూలు చేశారు. గతంలో హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నవంబర్‌లో నగరంలోని 8 చోట్ల సోదాలు చేపట్టింది.

జయశ్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, దాని అనుబంధ సంస్థల్లో తనిఖీలు చేసి పలు డాక్యుమెంట్లు, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది. ఈ క్రమంలో పరారీలో ఉన్న కాకర్ల శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసింది.




## హరీశ్‌రావు పెద్ద మనసు.. పేద విద్యార్థిని కోసం ఇంటిని తాకట్టుపెట్టి..!

సిద్దిపేట: బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తన పెద్ద మనసును చాటుకున్నారు. పీజీ వైద్యవిద్య చదువుతున్న ఓ పేద విద్యార్థినికి రుణం కోసం తన ఇంటిని తనఖా పెట్టారు. విద్యార్థిని మమత చదువు కోసం ఏటా రూ.7.50 లక్షలు చెల్లించాలని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఏదైనా ఆస్తి తనఖా పెడితేనే రుణం ఇస్తామని బ్యాంకర్లు స్పష్టం చేశారు.

ఈ విషయాన్ని హరీశ్‌రావు ద ృష్టికి మమత, ఆమె తండ్రి రామచంద్రం తీసుకెళ్లారు. దీంతో ఆయన సిద్దిపేటలోని తన ఇంటిని తనఖా పెట్టి రూ.20 లక్షల విద్యారుణం ఇప్పించారు. విద్యార్థిని హాస్టల్ ఫీజు కోసం రూ.లక్ష నగదు అందజేశారు.

## సింగరేణి కార్మికుల సమస్యలు పట్టవా.. రేవంత్ ప్రభుత్వంపై కవిత ఫైర్




భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబరు19 : సింగరేణి ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సింగరేణి ప్రైవేటీకరణతో మణుగూరు మనుగడ దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని వాపోయారు. సింగరేణి కార్మికుల సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు కవిత.

ఇవాళ(శుక్రవారం) మణుగూరు సింగరేణి పీకేఓసీ-2లో కవిత పర్యటించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంట్రాక్టు మహిళా కార్మికులతో టిఫిన్ చేశారు కవిత. ఫిట్ మీటింగ్‌లో సింగరేణి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భరోసా కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. సింగరేణి మీద ఆధారపడి 70 వేలమంది ప్రజలు జీవిస్తున్నారని చెప్పుకొచ్చారు. మణుగూరులో సింగరేణి మనుగడ 3 సంవత్సరాలేనని సింగరేణి సీఎండీ చెప్పారని గుర్తుచేశారు. పీకేఓసీ- 2మైన్‌ని ప్రైవేట్ పరం చేయకుండా సింగరేణికే ఉంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల పక్షాన నిలబడి హెచ్ఎంఎస్‌తో కలిసి తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని కవిత పేర్కొన్నారు.




హైదరాబాద్: ఆస్ట్రేలియా బాండీ బీచ్?లో కాల్పులకు తెగబడి పోలీసుల చేతుల్లో హతమైన ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా ఉగ్రవాది సాజిద్ అక్రమ్‌కు హైదరాబాద్‌తో సంబంధాలున్న సంగతి తెలిసిందే. అతను హైదరాబాద్ నగరంలోనే బీకామ్ వరకూ చదివారని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. సాజిద్ అక్రమ్ 27 సంవత్సరాల కాలంలో ఆరుసార్లు మాత్రమే భారతదేశానికి వచ్చాడని వెల్లడించారు. 1998లో అక్రమ్ ఉపాధి కోసం ఆస్ట్రేలియా వెళ్లాడని.. ఆ తర్వాత అదే సంవత్సవరం యురోపియన్ కు చెందిన యువతి వెనెరా గ్రోసోని వివాహం చేసుకున్నాడని తెలిపారు. పెళ్లి అయిన అదే ఏడాది మ్మొదటిసారిగా భార్యతో కలిసి హైదరాబాద్ వచ్చాడని చెప్పారు. 2004లో ఓసారి, 2009 ఫిబ్రవరిలో మరోసారి నగరానికి వచ్చాడని డీజీపీ వెల్లడించారు. 2011 జూబ్లీ ప్రాపర్టీ సెటిల్మెంట్ ఇంకోసారి వచ్చాడని, 2016 మరోసారి ప్రాపర్టీ సెటిల్మెంట్ కోసం ఇక్కడికి వచ్చాడని చెప్పుకొచ్చారు. 2022 తల్లి, సోదరిని చూడటం కోసం నగరానికి డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. కాగా, ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియాతో సంబంధం ఉన్న తండ్రీకొడుకులు సాజిద్ అక్రమ్, నవీద్ అక్రమ్.. యూదులంతా బాండీ బీచ్‌లో హునెక్కా పండుగ చేసుకుంటుండగా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 16 మంది మృతిచెందగా.. 36 మంది గాయపడ్డారు. పోలీసుల కాల్పుల్లో సాజిద్ అక్రమ్ అక్కడికక్కడే మ ృతిచెందగా.. అతని కుమారుడు నవీద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు నవీద్‌పై న్యూ సౌత్‌వేల్స్ పరిధిలోని బాండీ బీచ్ పోలీసులు మొత్తం 59 నేరాలకు పాల్పడినట్టు అభియోగాలు నమోదు చేశారు. వాటిలో 15 హత్యలు, ఓ ఉగ్రవాద చర్యకు సంబంధించిన కేసులు ఉన్నాయి.





ఖమ్మం: జిల్లాను అన్ని విధాలా నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జిల్లాను అభివ ృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి.. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న పనులను వివరించారు. పర్యాటక ప్రాంతంగా ఖమ్మంను అభివ ృద్ధి చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు మంత్రి. ప్రపంచస్థాయి డిజైన్‌తో నగరంలో క్రికెట్ స్టేడియం నిర్మాణం చేస్తున్నామని మంత్రి తుమ్మల వెల్లడించారు. సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ పూర్తి కావొచ్చిందని వెల్లడించారు. ఖిల్లాకు రోప్ వే పనులు ప్రారంభమయ్యాయని.. జూన్ నాటికి మున్నేటిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం పూర్తి కావొచ్చిందని.. అలాగే శిల్పారామం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మెడికల్ కళాశాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఖమ్మంలో హరిత హోటల్ నిర్మాణం చేయబోతున్నామని చెప్పారు. 20ఎకరాలను టీటీడీకి అందజేస్తున్నామని.. వారి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ మిగిలిన అన్ని చెరువులకూ క ృషా? జలాలు అందజేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రాబోయే జూన్ నాటికి 25 వేల ఎకరాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. టన్నెల్స్ అన్నింటినీ శరవేగంగా పూర్తి చేసి అన్నదాతలకు సాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పుకొచ్చారు. పాలేరుకు గోదావరి జలాలు వస్తేనే సీతారామ లక్ష్యం పూర్తవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు తుమ్మల. మరోవైపు స్వామి నారాయణ స్కూల్ నిర్మాణం జరుగుతోందని.. వెలుగుమట్ల అర్బన్ పార్క్ నిర్మాణం పూర్తి చేసి మంచి మ్యూజియం, పార్క్ ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## రామ్ సుతార్ మృతి శిల్ప కళకు తీరని లోటు: కేసీఆర్





హైదరాబాద్, డిసెంబరు19 : ప్రపంచ ప్రఖ్యాత శిల్పకారుడు, గుజరాత్ సర్దార్ పటేల్ ఐక్యతా శిల్పం రూపకర్త, హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ రూప శిల్పి, పద్మ భూషణ్ రామ్ వంజీ సుతార్ మృతిపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రముఖుల విగ్రహాలకు రూపం పోసి.. ప్రపంచ స్థాయి ప్రతిభను కనబరిచి, శిల్ప కళా రంగంలో కోహినూర్ వజ్రంగా పోల్చదగిన రామ్ సుతార్ శిల్ప కళా సేవలను, బాబా సాహెబ్ అంబేద్కర్ రూపంలో తెలంగాణ రాష్ట్రం వినియోగించుకోవడం గర్వ కారణమని కీర్తించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్మాణంలో, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, తెలంగాణ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా, డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని 125 అడుగుల ఎత్తులో అత్యంత సుందర మనోహరంగా తీర్చిదిద్దారని కొనియాడారు. రామ్ సుతార్ తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని ప్రశంసించారు. వారి మరణం, శిల్ప కళా రంగానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. నిండు నూరేళ్ల జీవితాన్ని పరిపూర్ణంగా కొనసాగించి దివంగతులు అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా రామ్ వంజీ సుతార్ కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## బీజాపూర్ జిల్లాలో ఎన్ కౌంటర్.. మావోయిస్ట్ మృతి



ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య చోటుచేసుకుంటున్న ఎన్ కౌంటర్లలో పెద్ద ఎత్తున మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతూ ఉన్నారు. శుక్రవారం బీజాపూర్ జిల్లాలో డీఆర్జీ జవాన్లకు మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు ప్రాణాలు కోల్పోయాడు. సంఘటనా స్థలం నుంచి భద్రతా దళాలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇంద్రావతి ప్రాంతంలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో డీఆర్జీ జవాన్లు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఉదయం నుంచి డీఆర్జీ బృందానికి, మావోయిస్టులకు మధ్య అడపాదడపా కాల్పులు జరుగుతున్నాయి. ఎదురుకాల్పుల ఘటనను ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ ధృవీకరించారు. భైరంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ కౌంటర్ జరిగినట్లు తెలిపారు. కాగా, ఛత్తీసగఢ్‌లోని సుక్మా జిల్లా కిష్టారం అడవుల్లో మావోయిస్టులు, డీఆర్జీ బలగాల మధ్య గురువారం జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఒక మహిళ కూడా ఉంది. కిష్టారం అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో డీఆర్జీ బలగాలు కూంబింగ్ చేపట్టగా ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. చనిపోయినవారు మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ సభ్యులైన మడివి జోగా, సోది బండి, నుప్పో బజ్జీ (మహిళ)గా పోలీసులు గుర్తించారు.

## ప్రభాకర్ రావు కస్టడీ పొడిగింపు.. సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరో వారం రోజుల పాటు పొడిగించింది సుప్రీం కోర్టు. డిసెంబర్ 25 వరకు కస్టోడియల్ విచారణ చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. కాగా.. నిన్నటి (గురువారం) ప్రభాకర్ రావు వారం రోజుల కస్టోడియల్ విచారణ పూర్తి అయిన విషయం తెలిసిందే. అయితే ట్యాపింగ్ కేసులో మరికొన్ని రోజులు విచారణ చేయాలని సుప్రీంకోర్టును సిట్ కోరింది. వారం రోజుల కస్టోడియల్ విచారణ రిపోర్ట్‌ను ఉన్నత న్యాయస్థానానికి సిట్ అందజేసింది. దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణను వారం రోజుల పాటు పొడిగింపుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 26న పోలీస్ కస్టడీ నుంచి ప్రభాకర్ రావును విడుదల చేయాలని.. తదుపరి విచారణ వరకు ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునేందుకు, అవసరమైన మందులు తీసుకునేందుకు ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. కాగా.. కొత్త సిట్ ఏర్పాటుతో ట్యాపింగ్ కేసు మరింత వేగవంతంగా విచారణ జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. సీపీ సజ్జనార్‌తో పాటు రామగుండం సీపీ ఆంబరి కిషోర్ జా కూడా సిట్‌లో ఉన్నారు. గతంలో వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిద్ధిపేట సీపీ విజయ్ కుమార్ కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మాదాపూర్ డీసీపీ రితి రాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డితో పాటు రవీందర్, వెంకట గిరి, కేఎస్ రావు, శ్రీధర్, నాగేందర్ రావుతో కొత్త సిట్ ఏర్పాటు అయ్యింది.




## శపథం నెరవేరింది.. 4 ఏళ్ల తర్వాత హెయిర్ కట్ చేయించుకున్న ఎమ్మెల్యే..

రాజకీయ నాయకులంటే ఇచ్చిన మాట నిలబెట్టుకోరన్న అభిప్రాయం ప్రజల్లో బాగా ఉంది. అతి కొద్ది మంది మాత్రమే ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఉన్నారు. మిగిలిన వాళ్లు ఎన్నికల సమయంలో తప్పితే తర్వాత కనిపించను కూడా కనిపించటం లేదు. ఇప్పుడు మనం చెప్పుకోబోయే స్టోరీలో ఓ బీజేపీ ఎమ్మెల్యే ప్రజల సమస్య తీర్చడానికి శపథం పన్నాడు. నాలుగేళ్ల పాటు హెయిట్ కట్ చేయించుకోలేదు. సమస్య తీరిన తర్వాత అందరి ముందుకు వచ్చి హెయిట్ కట్ చేయించుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ముంబైలోని ఘట్కోపర్ నియోజకవర్గంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే రామ్ కదమ్ నాలుగేళ్ల క్రితం నీటి సమస్యను తీరుస్తానని శపథం చేశాడు. నీటి సమస్య తీరే వరకు జుట్టు కత్తిరించుకోనని తేల్చి చెప్పాడు. నాలుగేళ్లు గడిచిపోయాయి. ఎంతో కష్టపడి ఆయన నీటి సమస్యకు పరిష్కారం తీసుకువచ్చాడు. ఇప్పటికే పనులు కూడా మొదలయ్యాయి. దీంతో రామ్ కదమ్ హెయిర్ కట్ చేయించుకోవటానికి సిద్ధమయ్యాడు. గురువారం ఓ గ్రామానికి వెళ్లి ఊరి ప్రజల ముందు హెయిర్ కట్ చేయించుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఐదేళ్ల క్రితం నాలో ఆలోచన మొదలైంది. కొండ ప్రాంతాల్లోకి నీళ్లు ఎలా తీసుకురావాలా అనుకుంటూ ఉండేవాడిని. ఇప్పుడు నాకు చాలా సంతోషంగా ఉంది. 2 కోట్ల లీటర్ల నీటిని నిలువ చేసుకోవటానికి అవకాశం ఉండేలా ట్యాంకుల నిర్మాణం జరుగుతోంది. భండుప్ నుంచి ఇక్కడికి నీటి సరఫరా జరుగుతుంది. ఇక్కడ నీటిని సప్లయ్ చేస్తున్న విధానం దేశానికి ఓ రోల్ మోడల్ కానుంది. ఇదే మోడల్‌ను దేశంలోని మిగిలిన ప్రదేశాల్లో వాడే అవకాశం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా వాడినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు' అని అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే రామ్ కదమ్ నాలుగేళ్ల తర్వాత హెయిర్ కట్ చేయించుకుంటున్న దృశ్యాల తాలూకా వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు ఎమ్మెల్యేపై ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com